తెలుగు దినపత్రిక
https://aksharagalam.com
అక్షరగళం
నిజం.. నిర్భయంగా
హైదరాబాద్ | పేజీలు 8 | /aksharagalam.com | శుక్రవారం, మార్చి 6, 2026 | సంపుటి : 14 సంచిక : 9 వెల : 3/-

## మెస్సీపై ట్రంప్ ప్రశంసలు

2025 మేజర్ లీగ్ సాకర్ (ఎంఎల్ఎస్) ఛాంపియన్స్‌గా నిలిచిన ఇంటర్ మయామి జట్టుకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వైట్‌హౌస్‌లో ఘనంగా ఆతిథ్యం ఇచ్చారు. ఈ సందర్భంగా ఫుట్‌బాల్ దిగ్గజం లియోనెల్ మెస్సీని ప్రత్యేకంగా అభినందించారు. చరిత్రలో ఏ అమెరికా అధ్యక్షుడికీ దక్కని గౌరవం తనకు దక్కిందని ట్రంప్ వ్యాఖ్యానించారు. ఈ కార్యక్రమంలో ట్రంప్ మాట్లాడుతూ... "ఈ రోజు 2025 ఎంఎల్ఎస్ కప్ ఛాంపియన్స్ ఇంటర్ మయామికి ఆతిథ్యం ఇవ్వడం చాలా ఆనందంగా ఉంది. ఇంతకుముందు ఏ అమెరికా అధ్యక్షుడికీ దక్కని ఒక ప్రత్యేకమైన అవకాశం నాకు దక్కింది. లియోనెల్ మెస్సీ, వైట్‌హౌస్‌కు స్వాగతం" అని అన్నారు. మెస్సీ జట్టులోకి వచ్చిన తర్వాత ఇంటర్ మయామి ప్రపంచవ్యాప్తంగా ప్రభావం చూపిందని కొనియాడారు. "చాలా మంది అంతర్జాతీయ స్టార్లు అమెరికా లీగ్స్‌కు భారీ అంచనాలతో వస్తారు కానీ, టైటిల్స్ గెలవడంలో విఫలమవుతారు. కానీ, మెస్సీ వచ్చాడు, గెలిచాడు. ఇది చాలా అసాధారణమైన విషయం" అని ట్రంప్ వ్యాఖ్యానించారు. అంచనాలకు మించి రాణించడం, ఒత్తిడిని అధిగమించి గెలవడం మెస్సీకే సాధ్యమైందని ప్రశంసించారు. ఈ సీజన్‌లో ఇంటర్ మయామి జట్టు రికార్డు స్థాయిలో 101 గోల్స్ చేసిందని, ఫిఫా క్లబ్ వరల్డ్ కప్‌లో యూరోపియన్ జట్టును ఓడించి చరిత్ర సృష్టించిందని గుర్తుచేశారు.

# యుద్ధ బీభత్సం

## పశ్చిమాసియాలో కొనసాగుతున్న కల్లోలం



- అమెరికాకు చెందిన చమురు నౌకపై ఇరాన్ మెరుపు దాడి
- నౌక పూర్తిగా మంటల్లో చిక్కిందని పేర్కొన్న ఇరాన్ ప్రభుత్వ వర్గాల
- ఇరాక్, కువైట్‌ల్లో కూడా రెండు చమురు నౌకలపై దాడి!
- యూఏఈ, అజర్‌బైజాన్, దోహాపై బాంబులు, డ్రోన్లు
- ఇరాన్ నౌకాశ్రయంపై భారీ దాడులతో విరుచుకుపడ్డ అమెరికా
- దేశవ్యాప్తంగా భారీ స్థాయిలో క్షిపణి, బాంబు దాడులతో విధ్వంసం
- లెబనాన్‌పై దాడుల తీవ్రతను మరింత పెంచిన ఇజ్రాయెల్

దుబాయ్: పశ్చిమాసియాలో యుద్ధ బీభత్సం నానాటికీ పెరుగుతోంది. అమెరికా, ఇజ్రాయెల్ గురువారం ఆరో రోజు ఇరాన్ వ్యాప్తంగా భారీ స్థాయిలో క్షిపణులు, బాంబు దాడులతో విరుచుకుపడ్డాయి. ప్రతిగా ఇరాన్ కూడా ఇజ్రాయెల్‌పై పలు దఫాలుగా తీవ్ర స్థాయిలో దాడులు కొనసాగించింది. పలు గల్ఫ్ దేశాలపైనా మరిన్ని డ్రోన్ దాడులకు పాల్పడింది.

- మిగతా 2వ పేజీలో



## విధ్వంసం చేయకుండానే మూసీ సుందరీకరణ పనులు చేయవచ్చు: కేటీఆర్

- బీఆర్ఎస్ హయాంలో ఐదున్నర కిలోమీటర్ల పొడవున సుందరీకరణ పనులు చేశామన్న కేటీఆర్
- ప్రజల ఆస్తులకు నష్టం చేయకుండా అభివృద్ధి చేయవచ్చని నిరూపించామన్న కేటీఆర్
- సుందరీకరణ పనులు తమకు అప్పగిస్తే రూ.16 వేల కోట్లకే చేసి చూపిస్తామని సవాల్

2లో

## తెలంగాణ కొత్త గవర్నర్ గా శివ ప్రతాప్ శుక్లా

- దేశవ్యాప్తంగా పలు రాష్ట్రాల గవర్నర్లను మారుస్తూ రాష్ట్రపతి ఉత్తర్వులు
- తెలంగాణ గవర్నర్‌గా హిమాచల్ ప్రదేశ్ గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా నియామకం
- ప్రస్తుత తెలంగాణ గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ మహారాష్ట్రకు బదిలీ
- ఢిల్లీ మరియు లడఖ్ లెఫ్టినెంట్ గవర్నర్ల స్థానాల్లోనూ మార్పులు





2లో

## పరుగుల వరదతో ఫైనల్లోకి

- టి20 ప్రపంచకప్‌లో తుది పోరుకు భారత్
- సెమీస్‌లో 7 పరుగులతో ఇంగ్లండ్‌పై గెలుపు
- మళ్లీ చెలరేగిన సంజు సామ్సన్
- బెతెల్ శతకం వృథా
- ఆదివారం న్యూజిలాండ్‌తో ఫైనల్

భారత జట్టు స్కోరు 253 పరుగులు... ఇందులో 18 ఫోర్లు, 19 సిక్స్‌లు.. వరల్డ్ కప్ చరిత్రలో ఏ జట్టూ కూడా ఇంత లక్ష్యాన్ని ఛేదించలేదు. ఇక గెలుపు లాంఛనమే, ఫైనల్ చేరడం ఖాయమనే అనిపించింది. కానీ ఇంగ్లండ్ కూడా ఏమాత్రం తగ్గలేదు. భారీ స్కోరును చూసి బెదిరిపోకుండా ఆ జట్టు కూడా 21 ఫోర్లు, 15 సిక్స్‌లతో ఆఖరి వరకూ పోరాడింది... కానీ అదృష్టవశాత్తూ టీమిండియా అభిమానులు ఊపిరి పీల్చుకున్నారు. పరుగుల వరద పారిన ఈ మ్యాచ్‌లో చివరకు 7 పరుగులతో సూర్యకుమార్ బృందం గట్టెక్కింది.

# సింఘ్వీ, వేం ఎన్నిక ఏకగ్రీవమే!



- సంఖ్యాబలం లేక రాజ్యసభ పోటీలో నిలవని ప్రతిపక్ష బీఆర్ఎస్
- ఎమ్మెల్యేలెవరూ బలపరచకుండానే స్వతంత్ర అభ్యర్థిగా ఒకరి నామినేషన్
- నేడు స్క్రూటినీలో తిరస్కరణకు గురవుతుందన్న అసెంబ్లీ వర్గాలు
- సీఎం సమక్షంలో నామినేషన్లు వేసిన సింఘ్వీ, వేం నరేందర్‌రెడ్డి.. ఎన్నిక లాంఛనమే

హైదరాబాద్: తెలంగాణ నుంచి రాజ్యసభకు అభిషేక్ మను సింఘ్వీ, వేం నరేందర్‌రెడ్డి ఎన్నిక ఏకగ్రీవం కానుంది. కాంగ్రెస్ పార్టీ వారిద్దరినీ రాజ్యసభ అభ్యర్థులుగా ఎంపిక చేయగా గురువారం శాసనసభ ప్రాంగణంలో ఎన్నికల అధికారి ఉపేందర్‌రెడ్డికి నామినేషన్ పత్రాలను సమర్పించారు. తగినంత సంఖ్యాబలం లేనందున బీఆర్ఎస్ రాజ్యసభ ఎన్నికల బరిలో ఎవరినీ పోటీకి నిలపలేదు. సాయి అనే వ్యక్తి స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేసినప్పటికీ 10 మంది ఎమ్మెల్యేలు బలపరచాలనే నిబంధనను పాటించని కారణంగా ఆయన అభ్యర్థిత్వం శుక్రవారం

- మిగతా 2వ పేజీలో



## జగన్ జీతం తీసుకోవడం లేదు


- వైసీపీ ఎమ్మెల్యేలు సభకు హాజరు కాకపోవడంపై అయ్యన్నపాత్రుడు అసహనం
- గవర్నర్ ప్రసంగం రోజున సభలో కాసేపు ఉన్నంత మాత్రాన అది పూర్తి హాజరు కాదని వ్యాఖ్య
- వైసీపీకి ప్రతిపక్ష హోదా ఇవ్వడం సాధ్యం కాదన్న స్పీకర్

2లో



## రాజ్యసభకు నితీశ్ నామినేషన్

- బీజేపీ అధ్యక్షుడు నితిన్ నబీన్ కూడా
- బిహార్‌లో మొత్తం ఆరుగురు అభ్యర్థుల నామినేషన్లు
- సీఎం పదవి నుంచి తప్పుకుంటున్నట్లు నితీశ్ ప్రకటన
- కొత్త ప్రభుత్వానికి తన సహకారం ఉంటుందని వెల్లడి



## జనాభా నియంత్రణ కాదు.. ఇప్పుడు నిర్వహణే ముఖ్యం

- ఒకరు వద్దు.. ముగ్గురు ముద్దు.. మారిన పరిస్థితులకు తగ్గట్టు కొత్త నినాదం
- రాష్ట్రంలో ఫెర్టిలిటీ రేటు 1.5కి పడిపోవడం భవిష్యత్తుకు ప్రమాదకరమని వెల్లడి
- ఎంతమంది పిల్లలుంటే అంతమందికి 'తల్లికి వందనం' అందిస్తామని ప్రకటన
- తెలుగు జాతి శక్తిమంతంగా ఉండాలంటే జనాభా 5 కోట్లకు తగ్గకూడదని ఉద్ఘాటన

గతంలో జనాభా పెరిగితే ఏమవుతుందో అని ఆందోళన చెందాను. కానీ ఇప్పుడు మారిన పరిస్థితుల రీత్యా విధానాలు మార్చుకున్నాం... అని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. అమరావతి అసెంబ్లీ వేదికగా పాపులేషన్ మేనేజ్మెంట్ పాలసీ ప్రకటనపై జరిగిన చర్చలో సీఎం

- మిగతా 2వ పేజీలో

# జగన్ జీతం తీసుకోవడం లేదు

ఆంధ్రప్రదేశ్ శాసనసభ బడ్జెట్ సమావేశాలకు వైసీపీ ఎమ్మెల్యేలు గైర్హాజరవుతుండటంపై స్పీకర్ అయ్యన్నపాత్రుడు తీవ్రంగా స్పందించారు. ఈరోజు అసెంబ్లీలో ఆయన మాట్లాడుతూ, ప్రజలు తమ సమస్యల గురించి గళం విప్పుతారని ఓట్లు వేసి గెలిపిస్తే, సభకు రాకుండా పారిపోవడం ప్రజాస్వామ్యాన్ని పరిహసించడమేనని మండిపడ్డారు. సభకు హాజరుకాకుండా కేవలం బయట ఉంటూ జీతభత్యాలు తీసుకోవడం నైతికంగా సరికాదని అన్నారు. వైసీపీ ఎమ్మెల్యేలంతా జీతాలు తీసుకుంటున్నారని, ఆ పార్టీ అధినేత జగన్ మాత్రం జీతం తీసుకోవడం లేదని చెప్పారు. కేవలం గవర్నర్ ప్రసంగం రోజున వచ్చి కాసేపు నిరసన తెలిపి వెళ్లినంత మాత్రాన అది పూర్తిస్థాయి హాజరు అనిపించుకోదని స్పీకర్ స్పష్టం చేశారు. రాజ్యాంగ నిబంధనల ప్రకారం వరుసగా 65 రోజుల పాటు సభకు అనుమతి లేకుండా గైర్హాజరైతే ఆ సభ్యులపై కఠిన చర్యలు తీసుకునే అవకాశం ఉందని, వారికి నోటీసులు జారీ చేస్తామని హెచ్చరించారు. బాధ్యతారాహిత్యంగా వ్యవహరించే ప్రజా ప్రతినిధులను 'రీకాల్' చేసే హక్కు ప్రజలకు ఉండాలని, దీనిపై చట్ట సవరణలు అవసరమని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ సమస్య కేవలం ఏపీకే పరిమితం కాదని, దేశవ్యాప్తంగా చట్టసభల గౌరవాన్ని కాపాడటానికి లోక్‌సభ స్పీకర్‌ను కలిసి చర్చిస్తానని తెలిపారు. ప్రస్తుతం అసెంబ్లీలో ప్రతి ఎమ్మెల్యే సీటు వద్ద ఏర్పాటు చేసిన ఏఐ ఆధారిత ఫేషియల్ రికగ్నిషన్ కెమెరాల ద్వారా సభ్యుల హాజరును కచ్చితంగా నమోదు చేస్తున్నామని, దీని ద్వారా ఎవరు ఎంతసేపు సభలో ఉన్నారో రికార్డు అవుతుందని స్పీకర్ వివరించారు. నిబంధనల ప్రకారం కనీసం 10 శాతం సీట్లు (18 మంది ఎమ్మెల్యేలు) ఉన్న పార్టీకి మాత్రమే ప్రతిపక్ష హోదా లభిస్తుందని, కేవలం 11 సీట్లు ఉన్న వైసీపీకి ఆ హోదా ఇవ్వడం సాధ్యం కాదని అయ్యన్న పాత్రుడు మరోసారి తేల్చిచెప్పారు.

# తెలంగాణ కొత్త గవర్నర్ గా శివ ప్రతాప్ శుక్లా

దేశవ్యాప్తంగా పలు రాష్ట్రాల గవర్నర్లు, కేంద్రపాలిత ప్రాంతాల లెఫ్టినెంట్ గవర్నర్లను బదిలీ చేస్తూ కేంద్రం కీలక నిర్ణయం తీసుకుంది. మార్చి 5న వెలువడిన తాజా ఉత్తర్వుల ప్రకారం.. తెలంగాణతో పాటు మహారాష్ట్ర, తమిళనాడు, పశ్చిమ బెంగాల్, బీహార్ తదితర రాష్ట్రాలకు కొత్త గవర్నర్లను నియమించారు. ముఖ్యంగా తెలంగాణ గవర్నర్ పదవిలో మార్పు చోటుచేసుకుంది. ప్రస్తుతం హిమాచల్ ప్రదేశ్ గవర్నర్‌గా ఉన్న శివ ప్రతాప్ శు క్లాను తెలంగాణ నూతన గవర్నర్‌గా నియమించారు. ఇప్పటివరకు తెలంగాణ గవర్నర్‌గా వ్యవహరించిన జిష్ణు దేవ్ వర్మను మహారాష్ట్ర గవర్నర్‌గా బదిలీ చేశారు. రాష్ట్రపతి ఆమోదంతో ఈ ఉత్తర్వులు తక్షణం అమల్లోకి వచ్చాయి. పరిపాలనా సౌలభ్యం, వ్యూహాత్మక కారణాల దృష్ట్యా ఈ మార్పులు జరిగినట్లు తెలుస్తోంది. కొత్తగా నియమితులైన గవర్నర్లు త్వరలోనే ఆయా రాష్ట్రాల్లో బాధ్యతలు స్వీకరించనున్నారు.

**రాజ్యసభకు నితీశ్ నామినేషన్**

పట్నా: బిహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్, బీజేపీ చీఫ్ నితిన్ నబీన్ సహా ఐదుగురు గురువారం ఎన్డీయే తరఫున రాజ్యసభ అభ్యర్థులుగా నామినేషన్లు వేశారు. జేడీయూ చీఫ్‌గా ఉన్న నితీశ్ కుమార్, జనవరిలో బీజేపీ చీఫ్‌గా బాధ్యతలు చేపట్టిన నబీన్‌లు ఢిల్లీ నుంచి వచ్చిన కేంద్ర హోంమంత్రి అమిత్ షా సమక్షంలో విధాన సభ సెక్రటేరియట్‌లో అధికారులకు నామినేషన్ పత్రాలను సమర్పించారు. నామినేషన్లు వేసిన ఎన్డీయే అభ్యర్థుల్లో జేడీయూకు చెందిన కేంద్ర మంత్రి రామ్‌నాథ్ ఠాకూర్, ఆర్ఎల్ఎం చీఫ్ ఉపేంద్ర కుష్వాహ, బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శివేశ్ కుమార్ ఉన్నారు. వీరితోపాటు ఆర్జేడీ బలపరిచిన సిట్టింగ్ ఎంపీ, వ్యాపారవేత్త అమరేంద్ర ధారి సింగ్ సైతం నామినేషన్ వేశారు. ఆయన వెంట ఆర్జేడీ నేత తేజస్వీ యాదవ్ ఉన్నారు. సీఎం నితీశ్ కుమారుడు నిశాంత్ కుమార్ క్రియాశీల రాజకీయాల్లోకి వస్తున్నట్లుగా వార్తలు గుప్పుమన్న రెండు రోజుల్లోనే నితీశ్ రాజ్యసభకు నామినేషన్ వేయడం గమనార్హం. నితీశ్ కుమార్ రాజీనామాతో సీఎం పదవిని బీజేపీ నేత చేపడతారని భావిస్తున్నారు. అదేవిధంగా, ఇంజనీరింగ్ పట్టభద్రుడైన 40 ఏళ్ల నిశాంత్ కొత్త ప్రభుత్వంలో డిప్యూటీ సీఎంగా చేరుతారని అంటున్నారు. సీఎం రేసులో ఉన్న వారిలో ప్రస్తుత డిప్యూటీ సీఎం సమ్రాట్ చౌదరి పేరు గట్టిగా వినిపిస్తోంది. గతేడాది నవంబర్‌లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో అధికార ఎన్డీయేను అఖండ విజయం వైపు నడిపించిన నితీశ్ రాజీనామాతో బీజేపీ నేత ఒకరు ఆ పదవిని చేపట్టే అవకాశం ఉంది. ఇప్పటివరకు ఆ పార్టీ అభ్యర్థి సీఎం పదవిని చేపట్టని ఏకైక హిందీ రాష్ట్రం బిహార్. అయితే, నితీశ్ నిర్ణయాన్ని నిరసిస్తూ జేడీయూ కార్య కర్తలు ఆయన నివాసం వద్దకు పెద్ద సంఖ్యలో తరలి వచ్చారు. 'రాష్ట్ర రాజకీయాలను వదిలి రాజ్యసభకు వెళ్లా లని నితీష్ తీసుకున్న నిర్ణయం ఆశ్చర్యం కలిగిస్తోంది. ఆయన నిర్ణయంపై పార్టీ కార్యకర్తలు సంతోషంగా లేరు. ఆయన సీఎంగా కొనసాగాలి' అని రాష్ట్ర సున్నీ వక్ఫ్ బోర్డు చైర్మన్, జేడీ(యూ) నేత అల్హాజ్ మొహమ్మద్ ఇర్షాదుల్లా అన్నారు. నితీశ్ ట్వీట్ చూడగానే ఆయన రాసింది కాదని తేలిపోయింది. అది ఢిల్లీ నుంచి వచ్చిన ఆదేశమని అర్థ మైందని ఆర్జేడీ మరో నేత మనోజ్ ఝా వ్యాఖ్యానించారు.

# విధ్వంసం చేయకుండానే మూసీ సుందరీకరణ పనులు చేయవచ్చు: కేటీఆర్

విధ్వంసం చేయకుండా, ఎవరి ఇళ్లు కూల్చకుండా కూడా అభివృద్ధి, సుందరీకరణ పనులు చేయవచ్చని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు మూసీ పరివాహక ప్రాంతంలో ఐదున్నర కిలోమీటర్ల పొడవున సుందరీకరణ పనులు చేశామని గుర్తు చేశారు. ప్రజల ఆస్తులకు నష్టం చేయకుండా అభివృద్ధి చేయవచ్చని చెప్పడానికి ఇదే నిదర్శనమని అన్నారు. హైదరాబాద్ నగరంలోని నాగోల్‌లో సీవేజ్ ట్రీట్మెంట్ ప్లాంట్ (ఎస్టీపీ)ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నగరంలో హైడ్రా పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అరాచకాలకు అడ్డు అదుపు లేకుండా పోయిందని మండిపడ్డారు. పేదల ఇళ్లు కూల్చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రూ.1.50 లక్షల కోట్లతో మూసీ సుందరీకరణ పనులు చేస్తామని ముఖ్యమంత్రి చెబుతున్నారని, కానీ రూ.16 వేల కోట్లతోనే ఆ పనులు చేయవచ్చని అన్నారు. మూసీ సుందరీకరణ పనులను తమకు అప్పగిస్తే రూ.16 వేల కోట్లకే చేసి చూపిస్తామని అన్నారు. పైగా ఒక్క ఇల్లు కూడా కూల్చకుండా అభివృద్ధి చేస్తామని అన్నారు. హామీల అమలు కోసమే కాంగ్రెస్ పార్టీకి ప్రజలు పట్టం కట్టారని అన్నారు.

# పరుగుల వరదతో ఫైనల్లోకి

ముంబై: టి20 వరల్డ్ కప్‌ను నిలబెట్టుకునే ప్రయత్నంలో భారత జట్టు ఒకే ఒక్క అడుగు దూరంలో నిలిచింది. వరుసగా రెండోసారి మన టీమ్ తుది పోరుకు అర్హత సాధించింది. గురువారం వాంఖెడే మైదానంలో హోరాహోరీగా సాగిన రెండో సెమీఫైనల్ సమరంలో 7 పరుగుల తేడాతో ఇంగ్లండ్‌ను ఓడించి భారత్ ఫైనల్లోకి అడుగు పెట్టింది. టాస్ గెలిచిన ఇంగ్లండ్ ఫీల్డింగ్ ఎంచుకోగా, ముందుగా బ్యాటింగ్‌కు దిగిన భారత్ నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 253 పరుగులు చేసింది.'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' సంజు సామ్సన్ (42 బంతుల్లో 89; 8 ఫోర్లు, 7 సిక్సులు) మెరుపు బ్యాటింగ్‌తో చెలరేగగా... శివమ్ దూబే (25 బంతుల్లో 43; 1 ఫోర్, 4 సిక్సులు), ఇషాన్ కిషన్ (18 బంతుల్లో 39; 4 ఫోర్లు, 2 సిక్సులు) కీలక పరుగులు సాధించారు. అనంతరం ఇంగ్లండ్ 20 ఓవర్లలో 7 వికెట్లకు 246 పరుగులు చేసి ఓడిపోయింది. జాకబ్ బెతెల్ (48 బంతుల్లో 105; 8 ఫోర్లు, 7 సిక్సులు) సెంచరీతో పోరాడినా జట్టుకు ఓటమి తప్పలేదు. ఆదివారం అహ్మదాబాద్‌లో జరిగే ఫైనల్లో న్యూజిలాండ్‌తో భారత్ తలపడుతుంది. భారత్, కివీస్ మధ్య టి20 వరల్డ్ కప్ ఫైనల్ జరగడం ఇదే తొలిసారి.



ఓపెనర్ అభిషేక్ శర్మ (9) మరోసారి విఫలమైనా... సామ్సన్, ఇషాన్ భాగస్వామ్యంతో భారత్ దూసుకుపోయింది. ఆర్చర్ తొలి ఓవర్లో వరుసగా 4, 6 కొట్టిన సామ్సన్ అతని రెండో ఓవర్లో కూడా 2 ఫోర్లు, సిక్స్ బాదాడు. మరోవైపు ఇషాన్ కూడా మూడు ఫోర్లు కొట్టడంతో పవర్‌ప్లే ముగిసేసరికి స్కోరు 67 పరుగులకు చేరింది. డాసన్ ఓవర్లో భారీ సిక్స్‌తో 26 బంతుల్లో సామ్సన్ అర్ధ సెంచరీ పూర్తి చేసుకోగా, స్యామ్ కరన్ ఓవర్లో ఇద్దరూ కలిసి 20 పరుగులు రాబట్టారు. రెండో వికెట్‌కు 45 బంతుల్లో 97 పరుగులు జోడించిన తర్వాత ఎట్టకేలకు ఇషాన్‌ను రషీద్ అవుట్ చేశాడు. అయితే స్పిన్‌ను సమర్థంగా ఎదుర్కొనే వ్యూహంతో బ్యాటింగ్‌లో ముందుగా దూబేను పంపిన భారత్ ఫలితం రాబట్టింది. రషీద్ ఓవర్లో 2 భారీ సిక్సులతో అతను చెలరేగాడు. ఆ తర్వాత ఆర్చర్ ఓవర్లో మరో రెండు సిక్సులు బాదిన సామ్సన్ మరింత దూకుడుగా ఆడే ప్రయత్నంలో వెనుదిరిగాడు. సూర్యకుమార్ (11) ఎక్కువసేపు నిలవలేకపోగా, ఒవర్టన్ ఓవర్లో హార్దిక్ పాండ్యా (12 బంతుల్లో 27; 3 ఫోర్లు, 2 సిక్సులు) మూడు ఫోర్లు కొట్టాడు. ఆర్చర్ వేసిన 19వ ఓవర్లో తిలక్ వర్మ (7 బంతుల్లో 21; 3 సిక్సులు) ఏకంగా మూడు భారీ సిక్సర్లతో రెచ్చిపోయాడు. 20వ ఓవర్లో పాండ్యా మరో 2 సిక్సులు కొట్టడంతో స్కోరు 250 దాటింది. ఆఖరి 5 ఓవర్లలో భారత్ 76 పరుగులు సాధించడం విశేషం. భారీ లక్ష్య ఛేదనలో ఇంగ్లండ్ ఆరంభంలోనే ఫిల్ సాల్ట్ (5) వికెట్ కోల్పోయింది. జోస్ బట్లర్ (17 బంతుల్లో 25; 4 ఫోర్లు, 1 సిక్స్), హ్యారీ బ్రూక్ (7), టామ్ బాంటన్ (17) కూడా ఎక్కువసేపు నిలవలేకపోయారు. అయితే బెతెల్ మాత్రం పోరాటపటిమ కనబర్చాడు. బుమ్రా బౌలింగ్‌లో సిక్స్ కొట్టిన అతను వరుణ్ చక్రవర్తి ఓవర్లో వరుసగా 6, 6, 6 బాదడం విశేషం.

# జనాభా నియంత్రణ కాదు.. ఇప్పుడు నిర్వహణే ముఖ్యం

(మొదటి పేజీ తరువాయి)

సుదీర్ఘంగా ప్రసంగించారు. ఒకప్పుడు జనాభా నియంత్రణే పరమావధిగా భావించిన తాము, నేడు జనాభా నిర్వహణ (పాపులేషన్ మేనేజ్ మెంట్) వైపు ఎందుకు అడుగులు వేయాల్సి వచ్చిందో సవివరంగా తెలియజేశారు. ప్రస్తుతం రాష్ట్రంలో టోటల్ ఫెర్టిలిటీ రేట్ (టీఎఫ్ఆర్) ప్రమాదకర స్థాయిలో 1.5కి పడిపోయిందని సీఎం గణాంకాలతో సహా వివరించారు. ఇదే ధోరణి కొనసాగితే దక్షిణాది రాష్ట్రాల్లో నెగెటివ్ గ్రోత్ నమోదవుతుందని, భవిష్యత్తులో నియోజకవర్గాల పునర్విభజన (డీలిమిటేషన్) జరిగితే రాజకీయంగా దక్షిణాది రాష్ట్రాలు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ఈ సంక్షోభాన్ని దృష్టిలో ఉంచుకునే జనాభా నిర్వహణ విధానాన్ని తెరపైకి తెచ్చామన్నారు. గతంలో మాల్థూషియన్ థియరీ ప్రకారం జనాభా విపరీతంగా పెరిగితే ప్రకృతి వైపరీత్యాలు, కరవు కాటకాలు వస్తాయనే భయం ఉండేదని, అందుకే ఆనాడు కఠినమైన జనాభా నియంత్రణ చర్యలు చేపట్టామని చంద్రబాబు గుర్తు చేశారు. 96-97 ప్రాంతంలో ఎయిడ్స్ వ్యాధి నియంత్రణ కోసం 'బ్రేక్ సైలెన్స్' అంటూ ప్రచారాలు నిర్వహించామని, ఆర్థిక సంస్కరణలు, సాంకేతిక విప్లవం, కుటుంబ నియంత్రణ చర్యలతో సామాజికంగా ఎన్నో విజయాలు సాధించామని తెలిపారు. అయితే, నాడు తీసుకున్న ఆ చర్యల ఫలితంగా ఇప్పుడు పరిస్థితి పూర్తిగా తారుమారైందని, ప్రస్తుతం జనాభా తగ్గుదల అనేది కొత్త సవాలుగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. "ఇప్పుడు ఒకరు వద్దు.. ఇద్దరు ఒకే.. ముగ్గురు ముద్దు" అనే కొత్త నినాదాన్ని తీసుకోవాల్సిన ఆవశ్యకత ఏర్పడిందని చంద్రబాబు పేర్కొన్నారు. చైనా కేవలం ఒక్క సంతానం విధానంతో ఇప్పుడు వృద్ధాప్య జనాభాతో తీవ్ర సమస్యలు ఎదుర్కొంటోందని ఉదహరించారు. ఈ క్రమంలోనే కుటుంబంలో ఎంతమంది పిల్లలు ఉంటే అంతమందికి 'తల్లికి వందనం' పథకం వర్తింపజేస్తామని ప్రకటించారు. కుటుంబంలో ఎక్కువ మంది సభ్యులు ఉండేలా, మైక్రో ఫ్యామిలీస్ స్థానంలో ఉమ్మడి కుటుంబాల వ్యవస్థను ప్రోత్సహించేలా ప్రభుత్వ విధానాల్లో మార్పులు చేస్తామన్నారు. పెద్ద కుటుంబాలకు ప్రభుత్వం తరఫున ఎక్కువ ప్రోత్సాహకాలు అందిస్తామని హామీ ఇచ్చారు. సమాజంలో వస్తున్న మార్పులపైనా సీఎం ఆందోళన వ్యక్తం చేశారు. గతంలో బాల్య వివాహాలు సమస్యగా ఉండేవని, ఇప్పుడు ఆలస్యంగా వివాహాలు చేసుకోవడం వల్ల సంతానలేమి సమస్యలు తలెత్తుతున్నాయని తెలిపారు.

# సింఘ్వీ, వేం ఎన్నిక ఏకగ్రీవమే!

స్క్రూటినీలో తిరస్కరణకు గురవుతుందని అసెంబ్లీ వర్గాలు తెలిపాయి. దీంతో రాష్ట్రం నుంచి రాజ్యసభకు పార్టీ హైకమాండ్ ప్రతిపాదించిన సింఘ్వీ రెండోసారి, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్నేహితుడు వేం నరేందర్‌రెడ్డి రాజ్యసభలో అడుగుపెట్టడం లాంఛనం కానుంది. కాంగ్రెస్ పార్టీ తరఫున రాష్ట్రం నుంచి రాజ్యసభ అభ్యర్థులుగా ఎంపికైన అభిషేక్ మను సింఘ్వీ, వేం నరేందర్‌రెడ్డి ఉదయం 10:30 గంటలకు మంత్రులు, ఎమ్మెల్యేలతో కలిసి శాసనసభకు వచ్చి నామినేషన్లు దాఖలు చేశారు. మధ్యాహ్నం ఒంటిగంట ప్రాంతంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అసెంబ్లీకి రాగా ఆయనతో కలిసి వెళ్లి మరో సెట్ నామినేషన్ పత్రాలను ఎన్నికల అధికారి ఉపేందర్‌రెడ్డికి అందజేశారు. సింఘ్వీ మూడు సెట్ల నామినేషన్లు దాఖలు చేయగా వేం నరేందర్‌రెడ్డి నాలుగు సెట్లు దాఖలు చేశారు. మిత్రపక్షంగా ఉన్న ఎంఐఎం నుంచి నామినేషన్ల దాఖలు కార్యక్రమానికి హాజరైన ఎంఐఎం ఎమ్మెల్యేలు అహ్మద్ బిన్ బలాలా, జుల్ఫికర్ అలీ ఒక సెట్ నామిషన్ పత్రాలపై సంతకాలు చేశారు. ఊహించినట్లుగానే బీఆర్ఎస్ రాజ్యసభ బరిలో అభ్యర్థిని దించలేదు. రాజ్యసభ సభ్యత్వాన్ని పొందేందుకు అవసరమైన 40 మంది శాసనసభ్యుల బలం లేకపోవడంతో పోటీ చేయలేదని ఆ పార్టీ వర్గాలు తెలిపాయి.

నామినేషన్ దాఖలు అనంతరం వేం నరేందర్‌రెడ్డితో కలిసి గాంధీ భవన్‌కు వచ్చిన అభిషేక్ మను సింఘ్వీకి పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్‌ను కలిశారు. అనంతరం సింఘ్వీ తెలంగాణ తరఫున రాజ్యసభకు రెండోసారి వెళ్లనుండటాన్ని అదృష్టంగా భావిస్తున్నట్లు చెప్పారు. రెండోసారి తెలంగాణ నుంచి ఎంపీగా తనను ఎంపిక చేసిన కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే, అగ్రనేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, కేసీ వేణుగోపాల్‌కు ధన్యవాదాలు తెలిపారు. వేం నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ నుంచి రాజ్యసభకు వెళ్లడం ఆనందంగా ఉందని.. ఇప్పటివరకు ఎలా పనిచేశానో, భవిష్యత్తులోనూ అలాగే పనిచేస్తానన్నారు. రాష్ట్రానికి రావాల్సిన హక్కులు, నిధుల కోసం పోరాడుతానని పేర్కొన్నారు. తనను రాజ్యసభకు ఎంపిక చేసిన రేవంత్‌రెడ్డి, మహేశ్‌గౌడ్‌కు ధన్యవాదాలు తెలిపారు. కాగా, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క కుమారుడి పెళ్లికి హాజరయ్యేందుకు హైదరాబాద్ వచ్చిన పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేను సింఘ్వీ, వేం నరేందర్‌రెడ్డిలతో కలిసి సీఎం రేవంత్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు.

# యుద్ధ బీభత్సం



ఇరు పక్షాలూ నౌకలు, నౌకాశ్రయాలను లక్ష్యంగా చేసుకున్నాయి. పర్షియన్ గల్ఫ్‌లో అమెరికా చమురు నౌకపై దాడి చేసినట్టు ఇరాన్ ప్రకటించింది. దానికి నిప్పంటుకుని భారీగా మంటలు ఎగసిపడుతున్నట్టు ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ (ఐఆర్‌జీసీ) తెలిపింది. బుధవారం శ్రీలంక తీర సమీపంలో తమ యుద్ధనౌకపై అమెరికా జలాంతర్గామితో దాడి చేసి ముంచేసినందుకు ప్రతీకారంగా ఈ చర్యకు దిగినట్టు వెల్లడించింది. తమ యుద్ధ నౌకను ముంచేసినందుకు అమెరికా తీవ్రంగా పశ్చాత్తాప పడాల్సి వస్తుందని ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాఘ్చి హెచ్చరించారు. ఆ దేశ నౌకలను ఆ స్థాయిలో లక్ష్యం చేసుకుంటామని ప్రకటించిన కాసేపటికే ఐఆర్‌జీసీ నుంచి దాడి వార్త వెలువడింది. అమెరికా మాత్రం తమ చమురు నౌకపై దాడి జరిగినట్టు ధ్రువీకరించలేదు. అంతేగాక దక్షిణ ఇరాన్‌లోని కీలకమైన బందర్ అబ్బాస్ నౌకాశ్రయంపై అమెరికా యుద్ధ విమానాలు భారీస్థాయిలో విరుచుకుపడ్డట్టు తెలుస్తోంది. అక్కడ చాలాసేపటిదాకా భారీ స్థాయిలో పేలుళ్లు వినిపించినట్టు స్థానికులను ఉటంకిస్తూ మీడియా కథనాలు వెలువడ్డాయి. కీలకమైన హార్మూజ్ జలసంధికి బందర్ అబ్బాస్ అతి సమీపంలో ఉంటుంది. హార్మూజ్‌ను ఇరాన్ ఇక్కడినుంచే నియంత్రిస్తూ ఉంటుంది. మరోవైపు కువైట్‌లో కూడా ఒక చమురు నౌకపై దాడి జరిగింది. దాంతో అందులోని చమురు సముద్రంలోకి ఒలికిపోతున్నట్టు సమాచారం. ఇది కూడా ఇరాన్ పనేనని భావిస్తున్నారు! ఇరాక్‌లోని ఖోర్ అలా జుబెయిర్ నౌకాశ్రయం వద్ద బహమాస్‌కు చెందిన మరో చమురు నౌకపైనా ఇరాన్‌కు చెందిన బోటు ఆత్మాహుతి దాడికి దిగింది. యుద్ధం మొదలైనప్పటి నుంచీ గల్ఫ్ ప్రాంతంలో దాడుల బారిన పడ్డ చమురు నౌకల సంఖ్య 9కి చేరింది. దఅమెరికా తమ యుద్ధ నౌకను ముంచేసిన కాసేపటికే ఇరాన్ రెచ్చిపోయింది. ఇజ్రాయెల్‌తో పాటు గల్ఫ్ దేశాలపై బుధవారం అర్ధరాత్రి నుంచే దాడులను తీవ్రతరం చేసింది. దాంతో జెరూసలేం, టెల్ అవీవ్‌తో పాటు పలు నగరాల్లో జనం వేలాదిగా బంకర్లలో తలదాచుకుంటున్నారు. పదులకొద్దీ క్షిపణులు, డ్రోన్లను అడ్డుకుని నేల కూల్చినట్టు ఇజ్రాయెల్ ప్రకటించింది. యూఏఈ, ఖతర్‌తో పాటు దోహాలోని అమెరికా సైనిక స్థావరాలపైనా ఇరాన్ ఎడాపెడా డ్రోన్ దాడులకు దిగింది. ఆరు ఖండాంతర క్షిపణులతో పాటు 125 డ్రోన్లను అడ్డుకుని కూల్చేసినట్టు యూఏఈ ప్రకటించింది. అబుదాబిలో డ్రోన్ శకలాలు పడి ఆరుగురు గాయపడ్డారు. దాడుల నేపథ్యంలో దోహాలోని అమెరికా రాయబార కార్యాలయం సమీప ప్రాంతాలను ఖతర్ ఖాళీ చేయించింది. దాడుల తీవ్రత దృష్ట్యా దుబాయ్‌లోని ఎమర్జెన్సీ లాజిస్టిక్స్ హబ్‌లో కార్యకలాపాలను నిలిపేస్తున్నట్టు ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రకటించింది. అమెరికా, ఇజ్రాయెల్‌కు వ్యతిరేకంగా గళం విప్పకపోతే యూరప్ దేశాలు భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని ఇరాన్ హెచ్చరించింది! అంతేగాక తన దాడులను అజర్‌బైజాన్‌కూ విస్తరించడం కలకలం రేపుతోంది. నఖ్చివాన్‌లో విమానాశ్రయంతో పాటు ఓ స్కూలు వద్దా పేలుళ్లు సంభవించాయి. దాంతో ఇరాన్ సరిహద్దుల సమీపంలో గగనతలాన్ని అజర్‌బైజాన్ మూసేసింది. తమపై భారీ స్థాయిలో డ్రోన్ దాడులు జరిగాయంటూ మండిపడింది. ఇందుకు బేషరతుగా క్షమాపణలు చెప్పాలని అధ్యక్షుడు ఇల్హాం అలియేవ్ డిమాండ్ చేశారు. మరోవైపు అమెరికా ఎఫ్15ఈ యుద్ధ విమానం ఇరాన్‌లో కుప్పకూలినట్టు వార్తలొచ్చాయి. వాటిని యూఎస్ సెంట్రల్ కమాండ్ మాత్రం ఖండించింది. పశ్చిమాసియా దేశాల నుంచి ఐదు రోజులుగా దాదాపుగా పడకేసిన విమాన సర్వీసులు గురువారం పాక్షికంగా కొనసాగాయి. ఒమన్, ఖతర్ తదితర దేశాలు పలు సర్వీసులను నడిపాయి. దాంతో ఆయా దేశాల్లో చిక్కుబడ్డ యూరప్ తదితర దేశాలకు చెందిన వేలాదిమంది తిరుగు ప్రయాణమయ్యారు. యుద్ధ కల్లోలం ఇప్పటికే ఆందోళనలు రేకెత్తిస్తున్న వేళ ఇరాన్ ఉద్రిక్తతలను మరింతగా పెంచే ప్రకటనలకు దిగుతోంది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో పాటు ఇజ్రాయెలీల రక్తం కూడా కళ్లజూడాలంటూ ఇరాన్ మత పెద్ద అయతొల్లా అబ్దొల్లా జావేదీ అమోలీ ఏకంగా ప్రభుత్వ వార్తా చానళ్లోనే దేశవాసులకు పిలుపునిచ్చారు.

# ప్రజాస్వామ్యానికి నాల్గో స్తంభం జర్నలిజం: ఉప్పల్ ఎమ్మెల్యే

## కన్నుల పండుగ కాప్రా ప్రెస్ క్లబ్ పదవీ ప్రమాణ స్వీకార మహోత్సవం

## ప్రజల సమస్యలపై ధైర్యంగా నిలబడాలి.. మీడియాకు పిలుపు











**ఏఎస్ రావునగర్, మార్చి 05, (అక్షర గళం) :** ప్రజాస్వామ్యంలో జర్నలిజం నాల్గో స్తంభంగా నిలుస్తుంది. ప్రజలకు నిజమైన, నిష్పక్షపాత సమాచారం అందించడం మాత్రమే కాదు, సమాజంలో జరుగుతున్న అన్యాయాలను వెలుగులోకి తీసుకురావడం కూడా మీడియా బాధ్యత. జర్నలిస్టులు ఎలాంటి ఒత్తిడులకు లోనుకాకుండా ధైర్యంగా ప్రజల తరఫున నిలబడాలి" అని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. గురువారం ఏఎస్ రావు నగర్ డివిజన్ పరిధిలోని భవాని నగర్ కమ్యూనిటీ హాల్లో కాప్రా ప్రెస్ క్లబ్ నూతన కార్యవర్గం పదవీ ప్రమాణ స్వీకారానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా లక్ష్మారెడ్డి మాట్లాడుతూ... జర్నలిస్టులకు నిరంతరం అందుబాటులో ఉంటానని, సమస్యలను తన దృష్టికి తీసుకు వస్తే పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. జర్నలిస్టులు నిజాలను నిర్భయంగా రాయాలని సూచించారు. ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే, బిజెపి నాయకులు బేతి సుభాష్ రెడ్డి మాట్లాడుతూ... ఉప్పల్ నియోజకవర్గ జర్నలిస్టులతో ఉద్యమ కాలం నుంచి మంచి సంబంధాలు ఉన్నాయని అన్నారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం శ్రమించే జర్నలిస్టులకు అండగా ఉంటామని హామీ ఇచ్చారు.

చర్లపల్లి మాజీ కార్పొరేటర్లు బొంతు శ్రీదేవి మాట్లాడుతూ... జర్నలిస్టులు నిష్పక్షపాతంగా వార్తలు రాయాలని సూచించారు. జర్నలిస్టులకు కష్టసుఖాల్లో అండగా ఉంటామని హామీ ఇచ్చారు. కాప్రా మాజీ కార్పొరేటర్ స్వర్ణరాజు శివమణి మాట్లాడుతూ... జర్నలిస్టులు గత దశాబ్దకాలంగా తాను చేసిన అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలకు ప్రచారం కల్పించి తన ఉన్నతికి ఎంతో దోహదం చేశారని ప్రశంసించారు. బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు సింగిరెడ్డి సోమశేఖర్ రెడ్డి మాట్లాడుతూ... విద్యార్థి దశ నుంచి కాప్రా జర్నలిస్టులతో సత్సంబంధాలు ఉన్నాయని అన్నారు. జర్నలిస్టుల సంక్షేమం కోసం కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు జిర్రిపోతుల ప్రభుదాస్, పన్నాల దేవేందర్ రెడ్డి, సింగిరెడ్డి ధనపాల్ రెడ్డి, గొల్లూరి అంజయ్య, గుండారపు శ్రీనివాస్ రెడ్డి, బిఆర్ఎస్ సీనియర్ నాయకులు సింగిరెడ్డి సోమశేఖర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కొత్త అంజిరెడ్డి, టీటీడీపీ రాష్ట్ర మాజీ కార్యదర్శి నీరుగొండ సతీష్ బాబు, బిజెపి డివిజన్ అధ్యక్షురాలు తుమ్మల సంధ్యారెడ్డి, చర్లపల్లి డివిజన్ అధ్యక్షుడు చల్లా ప్రభాకర్, బిజెపి సీనియర్ నాయకులు అంబటి వెంకటాచలం, కనుకుల రజనీకాంత్ రెడ్డి, జీవీఎన్ రావు, సుడుగు మహేందర్ రెడ్డి, బిజెపి హెచ్.బి కాలనీ డివిజన్ అధ్యక్షుడు రామ్ ప్రదీప్, సంపత్ రావు, రేగొండ వెంకులు, బిఆర్ఎస్ ఏఎస్ రావు నగర్ డివిజన్ అధ్యక్షులు కాసం మహిపాల్ రెడ్డి, మురళి పంతులు, బిఆర్ఎస్ కాప్రా డివిజన్ అధ్యక్షుడు బైరి నవీన్ గౌడ్, బిఆర్ఎస్ హెచ్ బి కాలనీ డివిజన్ మాజీ అధ్యక్షుడు వంజరి ప్రవీణ్ కరిపే, బిఆర్ఎస్ చర్లపల్లి డివిజన్ అధ్యక్షుడు నేమూరి మహేష్ గౌడ్, పార్టీ సీనియర్ నాయకురాలు షేర్ మణమ్మ, బిఆర్ఎస్ నాయకులు గోగికర్ శివకుమార్, ఎస్ఎ. రహీం, రేగళ్ల సతీష్ రెడ్డి, శివసేన రాష్ట్ర కార్యదర్శి పూస శ్రీనివాస్, బిజెపి నాయకులు సుర్వి శ్రీనివాస్, టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి ఎం. శివానంద్, బిఆర్ఎస్ నాయకులు సుంకర సుశీల్, ఆర్యవైశ్య సంఘం నాయకులు గంప కృష్ణ గుప్తా, రేబెల్లి శ్రీనివాస్ గుప్తా, తిరుమల నగర్ కాలనీ అధ్యక్షులు మల్లేష్ గౌడ్, మహాత్మా గాంధీనగర్ కాలనీ అధ్యక్షులు బుడంపల్లి శ్రీనివాస్ గౌడ్, తెలంగాణ మాజీ పారా మిలిటరీ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు బుర సైదయ్య గౌడ్, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

### భవాని నగర్ కాలనీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో....

భవాని నగర్ కాలనీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ప్రెస్ క్లబ్ సభ్యులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కాలనీ అధ్యక్షులు జి. కృష్ణారెడ్డి, ప్రధాన కార్యదర్శి కె. చిరంజీవి, కోశాధికారి సిహెచ్ వి. రామరాజు, ఉపాధ్యక్షులు బివి పుల్లారావు, కె. హనుమయ్య, సంయుక్త కార్యదర్శులు ఎన్. సదాలక్ష్మి, టి శ్రీనివాస్ గుప్తా, ఆర్గనైజింగ్ సెక్రటరీ సిహెచ్. అశోక్ రెడ్డి, స్పోర్ట్స్ కల్చరల్ సెక్రటరీ జి వెంకట్ రెడ్డి, సలహాదారులు వి. శేఖర్, వి. శ్రీరాములు, బి. శ్రీనివాస్ గుప్తా, ఎన్.జి. బాల గంగాధర్ రావు, పి. శివప్రసాద్, ఎన్. సురేందర్, కాలనీ నాయకులు మొగులయ్య తదితరులు పాల్గొన్నారు.

### గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ ఆధ్వర్యంలో ఘనంగా సత్కారం

గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ ఆధ్వర్యంలో నూతనంగా ఎన్నికైన కమిటీని ఘనంగా సన్మానించారు. గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ ఉమ్మడి రాష్ట్రాల అధ్యక్షులు గున్నా రాజేందర్ రెడ్డి, రాష్ట్ర సహాయ కార్యదర్శి యానాల ప్రభాకర్, రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి ఎం. మధు, సుభాష్ చంద్రబోస్, ప్రభాకర్ తదితరులు హాజరై ప్రెస్ క్లబ్ సభ్యులను ఘనంగా సన్మానించారు.

### ఘనంగా పదవీ ప్రమాణ స్వీకారం

కాప్రా ప్రెస్ క్లబ్ కార్యవర్గంతో ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పదవీ ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా ప్రెస్ క్లబ్ ముఖ్య సలహాదారులు ఏంపల్లి పద్మారెడ్డి, బెలిదే అశోక్, అధ్యక్షులుగా మెరుగు చంద్రమోహన్, ఉపాధ్యక్షులుగా యావాపురం రవి, దొమ్మాటి కిరణ్ కుమార్, గార్లపాటి శ్రీనివాస్ రావు, గోవిందుకుంట్ల ఆంజనేయులు, ప్రధాన కార్యదర్శిగా ముత్యం ముఖేష్ గౌడ్, సంయుక్త కార్యదర్శిగా డి. శ్రీనివాస్, కె. వెంకట్, ఆర్గనైజింగ్ కార్యదర్శులుగా ఓ. నరసింహ, కీర్తి శ్రీనివాస్, కోశాధికారి రామచంద్రమూర్తి, కార్యవర్గ సభ్యులుగా గంగి కృష్ణ, బుడంపల్లి నిరంత్ గౌడ్, తొడుపునూరు బాలకృష్ణ పదవి ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్టులు పటేల్ నరసింహ, యాట రాజు, వెంకటాపురం రవి, రామకృష్ణ, శ్రీహరి, రవి యాదవ్, వాసు, ఎండి. రియాజ్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# నిస్వార్థ ప్రజా సేవకుడు చెన్న కిషన్‌రెడ్డి

### జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన మాజీ సర్పంచ్ లక్ష్మీ నర్సింహ్మా రెడ్డి



**ఆమనగల్లు, మార్చి 05 (అక్షర గళం):** నిస్వార్థ నిరంతర ప్రజా సేవకుడిగా పేరుపొందిన లయన్ చెన్న కిషన్ రెడ్డి జన్మదిన వేడుకలు పలువురు ప్రముఖుల ఆధ్వర్యంలో కడ్తాల్ మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ లక్ష్మీ నర్సింహ్మా రెడ్డి, లయన్ చెన్న కిషన్ రెడ్డిని పూలమాలలు, శాలువాతో సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం మాజీ సర్పంచ్ మాట్లాడుతూ.. చెన్న కిషన్ రెడ్డి సమాజ సేవలో ఎప్పటికప్పుడు ముందుండి పలు సేవా కార్యక్రమాలను లయన్స్ క్లబ్ ద్వారా నిర్వహిస్తూ ప్రజల మన్ననలు పొందుతున్న నిస్వార్థ సేవకుడని అన్నారు. సామాజిక సేవా కార్యక్రమాలలో భాగంగా "మీల్స్ ఆన్ వీల్స్", కార్యక్రమం ద్వారా అవసరమైన వారికి ఆహారం అందించడం, పేద ప్రజల కోసం ఉచిత హెల్త్ క్యాంపులు నిర్వహించడం, ఉచిత కంటి శస్త్ర చికిత్సలు చేయించడం వంటి కార్యక్రమాలు నిరుపేదలకు ఎంతో ఉపయోగకరంగా ఉన్నాయని తెలిపారు. అదేవిధంగా పాడి పరిశ్రమ అభివృద్ధికి ఆయన అందించిన సేవలు వెలకట్టలేనివని, రైతులకు మార్గదర్శకత్వం ఇవ్వడం, వేసవి కాలంలో ప్రజల దాహార్తి తీర్చేందుకు ఉచిత అంబలి కేంద్రాన్ని ఏర్పాటు చేయడం వంటి సేవా కార్యక్రమాలు నేటి యువతకు ఆదర్శప్రాయంగా నిలిచాయని తెలిపారు. ఇలాంటి సేవా కార్యక్రమాల ద్వారా సమాజానికి నిస్వార్థంగా సేవ చేస్తున్న చెన్న కిషన్ రెడ్డి భవిష్యత్తులో మరింత సేవా కార్యక్రమాలు చేపట్టాలని మాజీ సర్పంచ్ లక్ష్మీనరసింహారెడ్డి ఆకాంక్షించారు. ప్రజలకు అండగా నిలుస్తూ సేవా కార్యక్రమాలు కొనసాగించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో గవర్నర్ డా. మహేందర్ రెడ్డి, జోన్ చైర్మన్ జూలూరి లింగయ్య, జూలూరి రమేష్, ఐనవోలు మహేందర్ రెడ్డి, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.




## చిన్నారులకు పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం 19 వార్డు కౌన్సిలర్ మహమ్మద్ షాహిద్

**కల్వకుర్తి మార్చ్ 5 (అక్షరగళం) :** చిన్నారులకు ఆరోగ్యం వంతులుగా ఉండడానికి అంగన్వాడి కేంద్రాలలో సంపూర్ణ పౌష్టికాహారంతో ఎదుగుదలకు ఎంతగానో తోడ్పాటు అందిస్తుందని తల్లిదండ్రులు తన పిల్లలను అంగన్వాడి కేంద్రాల్లో చేర్పించాలని మహమ్మద్ అన్నారు. గురువారం కల్వకుర్తి పట్టణంలో 19వ వార్డు అంగన్వాడి కేంద్రంలో చిన్నారులకు అన్న ప్రసన్న కార్యక్రమం ఏర్పాటు చేశారు ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన చిన్నారులకు అన్న ప్రసాదం చేశారు ఈ కార్యక్రమంలో సాదిక్ ముజ్జు షకీల్ రామకృష్ణ జమీర్ అంగన్వాడి టీచర్ అలివేల తదితరులు పాల్గొన్నారు

# వ్యక్తి హత్య కేసులో ముగ్గురికి 10 ఏళ్ల జైలు శిక్ష

**అక్షర గళం ,మాదాపూర్ :** అన్నదమ్ముల మధ్య జరిగిన గొడవలో తమ్ముడిని హత్య చేసిన ముగ్గురికి న్యాయ మూర్తి 10 ఏళ్ల జైలు శిక్ష విధించారు. 2016లో మాదాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన హత్య కేసులో ముగ్గురు నిందితులకు 10 సంవత్సరాల కఠిన కారాగార శిక్ష విధిస్తూ రంగారెడ్డి జిల్లా కూకట్‌పల్లి కోర్టు తీర్పు వెలువరించిందని సైబరాబాద్ క్రైమ్స్ డీసీపీ ముత్యం రెడ్డి తెలిపారు. మధ్యప్రదేశ్ రాష్ట్రానికి చెందిన మహేంద్ర ప్రసాద్ మిశ్రా (29), ధర్మేంద్ర ప్రసాద్ మిశ్రా (45), బీరేంద్ర ప్రసాద్ మిశ్రా (37) అన్నదమ్ములు మాదాపూర్ పరిధిలోని సిద్ధికనగర్‌లో అద్దె గదిలో నివాసం ఉండేవారు. 18 నవంబర్ 2016న వీరి మధ్య జరిగిన గొడవలో దేవేంద్ర ప్రసాద్ మిశ్రాపై ముగ్గురు నిందితులు కత్తి , కిటికీ గాజు పలకతో దాడి చేశారు. ఈ దాడిలో దేవేంద్ర ప్రసాద్ మిశ్రా గొంతు వద్ద తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటనపై మాదాపూర్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి నిందితులను అరెస్ట్ చేసి న్యాయస్థానంలో హాజరుపరచగా న్యాయస్థానం వారికి జ్యుడీషియల్ కస్టడీ విధించింది. అనంతరం పోలీసులు పూర్తి స్థాయి దర్యాప్తు చేపట్టి చార్జ్‌షీట్ దాఖలు చేశారు. ఈ కేసులో విచారణ పూర్తి చేసిన రంగారెడ్డి జిల్లా కూకట్‌పల్లి కోర్టు ౧౦ అదనపు జిల్లా సెషన్స్ న్యాయమూర్తి. సి. పావని నిందితులు ముగ్గురినీ దోషులుగా తేల్చి, ఒక్కొక్కరికి 10 సంవత్సరాల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.2,000 జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించారని డీసీపీ తెలిపారు.



## బోగస్ ఓట్లపై ఈసీకి ఫిర్యాదు

**ఆమనగల్లు, మార్చి 05 (అక్షర గళం):** ఆమనగల్లు మునిసిపాలిటీ 7 వార్డులో బోగస్ ఓట్లపై గురువారం రాష్ట్ర ఎన్నికల కమిషన్ కు వార్డు కాంగ్రెస్ కాంటెస్టెడ్ అభ్యర్థి, ఆదివాసీ రాష్ట్ర నాయకులు కృష్ణనాయక్ గురువారం ఫిర్యాదు చేశారు. మున్సిపాలిటీ రికార్డులో లేని ఇంటి నంబర్ 14- 182 ఇంట్లో 15 ఓట్లు ఉన్నాయని, వారు ఓటు వేయడంతో తన విజ యావకాశాలపై తీవ్ర ప్రభావం పడిం దని ఆయన అన్నారు. తనకు న్యాయం చేయాలని కమి షన్ కు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఆదివాసీ రాష్ట్ర ఉపా ధ్యక్షుడు లింగం నాయక్, రాష్ట్ర కోఆర్డినేటర్ కోటయ్య నాయక్, రాష్ట్ర నాయకుడు కృష్ణ నాయ క్, వికారాబాద్ అధ్యక్షుడు రాంచంద్రు నాయక్, రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు శ్రీను నాయక్, తల్లోజు రామకృష్ణ, లక్ష్మీన్ నాయక్, సీమయ్య, హరి నాయక్ తదితరులు పాల్గొన్నారు.



## 'పదవి లేకున్నా వార్డు అభివృద్ధికి పనిచేస్తా'

**ఆమనగల్లు, మార్చి 05 (అక్షర గళం):** పదవి లేకున్నా నిత్యం ప్రజల మధ్య ఉంటూ వారి సమస్యలను పరిష్కరించి సేవ చేస్తానని ఐదో వార్డు కాంటెస్టెడ్ అభ్యర్థి ఒగ్గు మహేశ్ అన్నారు. గురువారం ఆమనగల్లు మున్సిపాలిటీ పరిధిలోని ఐదో వార్డులో రోడ్డు పక్కన ప్రయాణికులకు ఇబ్బందిగా ఉన్న బోరింగ్ ను మున్సిపల్ సిబ్బం దితో ఆయన తొలగింపజేశారు. అనంతరం వార్డు వీధుల్లోని నల్లాలకు మరమ్మతులు చేయించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది, కాలనీవాసులు పాల్గొన్నారు.

# వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు పాటించండి

## జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా. లలితాదేవి



**ఆమనగల్లు, మార్చి 05 (అక్షర గళం):** వేసవి కాలం ప్రారంభమైన నేపథ్యంలో ప్రజలందరూ వడదెబ్బ (హీట్ స్ట్రోక్) పై పూర్తి అవగాహన కలిగి జాగ్రత్తలు పాటించాలని రంగారెడ్డి జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ వైద్యాధికారి డాక్టర్ లలితా దేవి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. "వడదెబ్బకు గురికాకుండా జాగ్రత్తలు పాటిద్దాం వడదెబ్బ వలన సంభవించే మరణాలను అరికడదాం" అనే నినాదంతో ప్రతి ఒక్కరూ ముందుకు సాగాలని ఆమె సూచించారు. ఎండ తీవ్రత కారణంగా శరీర ఉష్ణోగ్రత 104.9 డిగ్రీల ఫారెన్‌హీట్ వరకు పెరిగి మెదడుపై ప్రభావం చూపుతుందని, దీనివల్ల శరీర ఉష్ణోగ్రత నియంత్రించే మెదడు కేంద్రం దెబ్బతిని హీట్ స్ట్రోక్ లేదా సన్ స్ట్రోక్ (వడదెబ్బ) సంభవిస్తుందని తెలిపారు. ఇది అత్యంత ప్రమాదకరమై, ప్రాణాంతకమయ్యే అవకాశం ఉందని హెచ్చరించారు.

**వడదెబ్బ లక్షణాలు**

చెమట పట్టకపోవడం, శరీర ఉష్ణోగ్రత అధికంగా పెరగడం, వణుకు పుట్టడం

**మగత నిద్ర, కలవరింతలు**

ఫిట్స్ రావడం లేదా అపస్మారక స్థితి ఎండలో బయటికి వెళ్లినప్పుడు పై లక్షణాలు కనిపించినట్లయితే వెంటనే సమీప వైద్యున్ని సంప్రదించి ప్రథమ చికిత్స పొందాలని సూచించారు.

**వడదెబ్బ నివారణకు తీసుకోవలసిన జాగ్రత్తలు:**

గొడుగు వాడటం, తెలుపు రంగు లేదా పలుచటి చేనేత వస్త్రాలు ధరించడం తలకు టోపీ లేదా రుమాలు ధరించడం

వేడి గాలులు తగలకుండా జాగ్రత్త పడడం ఉదయం 11.00 గంటల నుండి సాయంత్రం 4.00 గంటల వరకు ఆరుబయట అధిక శారీరక శ్రమతో కూడిన పనులు చేయకపోవడం దూర ప్రయాణాలు చేయాల్సి వచ్చినపుడు ఉదయం 11.00 గంటల లోపు లేదా సాయంత్రం 4.00 గంటల తరువాత చేయడం ఇంటి నుండి బయటకు వెళ్లే ముందు ఒక గ్లాసు మంచినీరు త్రాగడం ఎండలో తిరిగేటప్పుడు తాగునీరు వెంట తీసుకువెళ్లడం.

**ప్రథమ చికిత్స:**

వడదెబ్బ తగిలిన వ్యక్తిని వెంటనే నీడగల ప్రదేశానికి తీసుకెళ్లి, చల్లని నీటిలో ముంచిన తడి గుడ్డతో శరీరాన్ని తుడవాలని తెలిపారు. శరీర ఉష్ణోగ్రత సాధారణ స్థాయికి వచ్చే వరకు చల్లబరుస్తూ ఉండాలని సూచించారు. చల్లని గాలి తగిలేలా చూడాలని తెలిపారు. డీహైడ్రేషన్ నివారణకు ఉప్పు కలిపిన మజ్జిగ, గ్లూకోజ్ ద్రావణం లేదా ఓఆర్ఎస్ ద్రావణం త్రాగించవచ్చని తెలిపారు. అపస్మారక స్థితిలో ఉన్న రోగికి నీరు త్రాగించకూడదని, వెంటనే సమీప ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా. లలితా దేవి సూచించారు. ప్రజలందరూ అప్రమత్తంగా ఉండి వడదెబ్బ నివారణ చర్యలు పాటించి ఆరోగ్యంగా ఉండాలని ఆమె విజ్ఞప్తి చేశారు.

# యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి: ఎస్ఐ హరిప్రసాద్

## విద్యార్థులు మత్తు పదార్థాలకు బానిసైె భవిష్యత్ నాశనం డా. సింధూజ
## మత్తు వ్యసనాల నివారణలో యువతే ముందుండాలి
## వీ చారిటీ ఫౌండేషన్ చైర్మన్ బండారి శ్రీనివాస్ రెడ్డి







**కీసర,మార్చి 05,(అక్షర గళం) :** యువత మాదక ద్రవ్యాల బారిన పడకుండా ఉన్నత విద్యను అభ్యసించాలని కీసర ఎస్ఐ హరి ప్రసాద్ పేర్కొన్నారు.గురువారం కీసర మండల కేంద్రంలోని జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో వ్యాసరచన పోటీలలో భాగంగా ఎస్ఐ హరి ప్రసాద్ సమక్షంలో మాదకద్రవ్యాల వ్యతిరేక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.వీ చారిటీ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు, చైర్మన్ బండారి శ్రీనివాస్ రెడ్డి సౌజన్యంతో ఈ పోటీలు నిర్వహించి విజేతలకు నగదు బహుమతులు అందజేశారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కీసర పోలీస్ స్టేషన్ సబ్ఇన్స్పెక్టర్ హరి ప్రసాద్, మెడికల్ ఆఫీసర్ (పీడీకే) డాక్టర్ సింధూజ హాజరయ్యారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ,.. మత్తు పదార్థాలు, డ్రగ్స్, మత్తు పానీయాలు యువత ఆరోగ్యాన్ని తీవ్రంగా దెబ్బతీస్తాయని తెలిపారు. ఇవి మెదడు, గుండె, కాలేయం వంటి ముఖ్య అవయవాలపై ప్రతికూల ప్రభావం చూపడంతో పాటు మానసిక సమస్యలు, అలవాట్లు పెరగడానికి కారణమవుతాయని చెప్పారు. విద్యార్థులు చదువులపై దృష్టి పెట్టి ఇటువంటి చెడు అలవాట్లకు పూర్తిగా దూరంగా ఉండాలని సూచించారు.మత్తు పదార్థాల వినియోగం వల్ల కుటుంబాలు ఆర్థికంగా, సామాజికంగా కూడా ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని పేర్కొన్నారు. డ్రగ్స్, మత్తు పానీయాలు వాడటం వల్ల భవిష్యత్తు నాశనం కావడంతో పాటు నేరాలకు కూడా దారి తీసే ప్రమాదం ఉందని హెచ్చరించారు.వీ చారిటీ ఫౌండేషన్ చైర్మన్ బండారి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ,... సమాజంలో మత్తు పదార్థాల వినియోగాన్ని తగ్గించేందుకు అవగాహన కార్యక్రమాలు చాలా అవసరమని తెలిపారు.ముఖ్యంగా విద్యార్థుల్లో చిన్నప్పటి నుంచే మత్తు వ్యసనాలపై అవగాహన కల్పిస్తే భవిష్యత్తులో సమాజం ఆరోగ్యంగా ఉంటుందని పేర్కొన్నారు. యువత తమ లక్ష్యాలపై దృష్టి పెట్టి సమాజానికి ఆదర్శంగా నిలవాలని సూచించారు.పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు నగదు బహుమతులు అందజేశారు. మొదటి బహుమతి (రూ.3000) బోయ విఘ్నేశ్వరి (10వ తరగతి),రెండో బహుమతి (రూ.2000) సౌభియా (9వ తరగతి), మూడో బహుమతి (రూ.1000) సీమా భుశ్రా (8వ తరగతి),కన్సోలేషన్ బహుమతి (రూ.1000) జగ్గుల కిరణ్ కుమార్ (10వ తరగతి) అందుకున్నారు.

ఈ కార్యక్రమంలో కీసర మండల బీజేపీ సీనియర్ నాయకుడు మెట్టు మహేందర్ యాదవ్, ఉపాధ్యాయులు కె. రవి చంద్రశేఖర్, ఆర్. వెంకటేశ్వర్లు, బి. వెంకటేశ్వర్లు, రామాదేవి, సుభద్రా దేవి, ఆర్. ఆనంద్, డి. సుశీలత, వై. చంద్రారెడ్డి, పి. చందర్, ఏఏపీసీ చైర్మన్ జబీనా ఫాతిమా పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి సహకరించిన పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాంరెడ్డికి నిర్వాహకులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# దొంగల ముఠా గుట్టురట్టు.. ఆరుగురు నిందితుల అరెస్ట్

## నగదు 6 మొబైల్ ఫోన్లు బంగారం
## ఒక ఐరన్ రాడు స్క్రూడ్రైవర్ స్వాధీనం
## కల్వకుర్తి డిఎస్పి సాయి రెడ్డి వెంకట్ రెడ్డి



**కల్వకుర్తి మార్చి 5 (అక్షరగళం) :** కల్వకుర్తి సబ్ డివిజన్ పరిధిలోని వంగూరు వెల్దండ సర్కిల్ పరిధిలోని దొంగతనాలకు పాలు పడ్డ ఆరుగురు నిందితులను అరెస్టు చేసి నగదు బంగారం బంగారం వారు ఉపయోగించిన వాటిని స్వాధీనం పరుచుకున్నారు గురువారం కల్వకుర్తి డిఎస్పి కార్యాలయంలో డిఎస్పి ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో నిందితులను ప్రవేశపెట్టి కేసుకు సంబంధించిన వివరాలను కల్వకుర్తి డిఎస్పి సాయి రెడ్డి వెంకట్ రెడ్డి వివరాలను వెల్లడించారు పోలీస్ స్టేషన్ల పరిధిలో పలు దొంగతనాలకు పాల్పడిన ఆరుగురు దొంగలను పోలీసులు గురువారం అరెస్టు చేశారు. వీరు వంగూరు మండలం సర్వారెడ్డిపల్లి, కల్వకుర్తి, నాగర్ కర్నూల్, అచ్చంపేట మండలం హాజీపూర్, వెల్దండ మండలాల్లో ఇళ్లలో వరుస దొంగతనాలు, బంగారం దొంగతనాలకు పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. విశ్వసనీయ సమాచారం మేరకు గురువారం ఉదయం 10 గంటలకు శ్రీశైలం × రోడ్ దగ్గర గల ఒ ధాబా వద్ద ,నేరస్థులు ఆరుగురు కారు తో పట్టు పడినట్లు,వారిని పట్టుకుని విచారించగా వారి పేర్లు వివరములు చెప్పి, నిందితులు పై న తెలిపిన నేరాలు ఒప్పుకున్నారని పోలీసులు తెలిపారు. అయితే నేరస్థులు తక్కువ సమయంలో ఎక్కువ డబ్బులు సంపాదించాలనే ఆశతో, మద్యం అలవాటు మరియు సరైన ఉపాధి లేకపోవడం వలన ఒకరికొకరు పరిచయం ఏర్పరచుకొని ముఠాగా ఏర్పడి తాళాలు వేసిన ఇండ్లలో మధ్యాహ్నం ఎవరూ లేని సమయంలో ఇళ్లను గుర్తించి తాళాలు విరగగొట్టి నగదు మరియు బంగారం దొంగిలించేవారని తెలిసింది. తాళము వేసి ఉన్న ఇండ్లను లక్ష్యంగా చేసుకొని దొంగతనాలు చేసినట్లు విచారణలో వెల్లడైంది.

**నింధితుల మధ్య పరిచయం :**

A1. కోలుకులపల్లీ నాగేష్ మరియు A2. పుట్ట వెంకటయ్య , A4. పేరు కుంచేపు సైదులు ముగ్గురు కొండారెడ్డిపల్లి గ్రామస్థులు అయినందున వారికీ పరిచయము ఏర్పడినది. ఆ2. పుట్ట వెంకటయ్య ద్వారా ఆ3 ఎనుముల జంగయ్య పరిచయము. A3 ఎనుముల జంగయ్య A5. పెరుమాళ్ళ రామస్వామి A6. దొడ్డి యాదయ్య లు ముగ్గురు గుండాల గ్రామస్థులు అయినందున A3 ఎనుముల జంగయ్య ద్వారా A1, A2., A4 ల తో పరిచయము ఏర్పడినది

**నింధితుల గత నేర చరిత్ర :**

A`1 గతము లో ాదీ నగర్ పోలీస్ స్టేషన్ మరియు చెతైన్యపురి పోలీస్ స్టేషన్ ఏరియాలలో దొంగతనము కేసులలో జైలుకు వెళ్ళినాడని, దాబా వద్ద వీరిని అరెస్టు చేసినట్లు డిఎస్పి తెలిపారు.



# విద్యార్థులు ఉపాధ్యాయులైన వేళ..

**ఆమనగల్లు, మార్చి 05 (అక్షర గళం):** విద్యార్థులు చిన్నతనం నుంచే నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవాలని సర్పంచ్ మౌనిక శివ, మండల విద్యాధికారి పాండు అన్నారు. గురువారం ఆమనగల్లు మండల పరిధిలోని మంగళపల్లి గ్రామంలోని ప్రాథమిక ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు స్వయం పరిపాలన దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈఓ గా కొప్పు అవంతిక, ఎంఈవో గా కొప్పు విఘ్నేష్, ప్రధానోపాధ్యాయురాలుగా కొప్పు భవ్యశ్రీ మరియు విద్యార్థులు ఉపాధ్యాయులుగా విధులు నిర్వహించి అందరిని ఆకట్టుకున్నారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో సర్పంచ్ మౌనిక శివ, ఎంఈఓ పాండు మాట్లాడుతూ.. కృషి, పట్టుదల, క్రమశిక్షణ ఉంటే జీవితంలో సాధించలేనిది ఏదీ ఉండదని విద్యార్థులకు సూచించారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు శ్రీను, ఉపాధ్యాయులు సంఘమిత్ర, అనంతలక్ష్మి, విద్యార్థులు పాల్గొన్నారు.



## ప్రజల సంక్షేమంలో
## చెన్న కిషన్ రెడ్డి సేవలు ప్రశంసనీయం
## పూల బొకే అందజేసి శుభాకాంక్షలు
## తెలిపిన డిసిసిబి డైరెక్టర్ గంప వెంకటేష్ గుప్తా

**ఆమనగల్లు, మార్చి 05 (అక్షర గళం):** లయన్స్ క్లబ్ జిల్లా మాజీ గవర్నర్ లయన్ జి చెన్న కిషన్ రెడ్డి సేవలు ప్రశంసనీయం అని ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా డిసిసిబి డైరెక్టర్ గంప వెంకటేష్ గుప్తా, ఆమనగల్లు సింగల్ విండో చైర్మన్ గంప వెంకటేష్ గుప్తా అన్నారు. జన్మదిన వేడుకలు పలువురు ప్రముఖుల ఆధ్వర్యంలో కడ్తాల్ మండల కేంద్రంలో ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా డిసిసిబి డైరెక్టర్ గంప వెంకటేష్ గుప్తా లయన్ చెన్న కిషన్ రెడ్డిని పూల బొకే అందజేసి శాలువాతో సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం గంప వెంకటేష్ గుప్తా మాట్లాడుతూ.. చెన్న కిషన్ రెడ్డి సమాజ సేవలో ఎప్పటికప్పుడు ముందుండి పలు సేవా కార్యక్రమాలను లయన్స్ క్లబ్ ద్వారా నిర్వహిస్తూ ప్రజల మన్ననలు పొందుతున్న సేవకుడని అన్నారు. సామాజిక సేవా కార్యక్రమాలలో భాగంగా "మీల్స్ ఆన్ వీల్స్ కంటి వైద్య శిబిరాలు వంటి కార్యక్రమం ద్వారా అవసరమైన వారికి ఆహారం అందించడం, పేద ప్రజల కోసం ఉచిత హెల్త్ క్యాంపులు నిర్వహించడం, ఉచిత కంటి శస్త్ర చికిత్సలు చేయించడం వంటి కార్యక్రమాలు నిరుపేదలకు ఎంతో ఉపయోగకరంగా ఉన్నాయని తెలిపారు. అదేవిధంగా పాడి పరిశ్రమ అభివృద్ధికి ఆయన అందించిన సేవలు వెలకట్టలేనివని, రైతులకు మార్గదర్శకత్వం ఇవ్వడం, వేసవి కాలంలో ప్రజల దాహార్తి తీర్చేందుకు ఉచిత అంబలి కేంద్రాన్ని ఏర్పాటు చేయడం వంటి సేవా కార్యక్రమాలు నేటి యువతకు ఆదర్శప్రాయంగా నిలిచాయని తెలిపారు. ఇలాంటి సేవా కార్యక్రమాల ద్వారా సమాజానికి నిస్వార్థంగా సేవ చేస్తున్న చెన్న కిషన్ రెడ్డి ప్రజలకు అండగా నిలుస్తూ సేవా కార్యక్రమాలు కొనసాగించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో గవర్నర్ డా. మహేందర్ రెడ్డి, జోన్ చైర్మన్ జూలూరి లింగయ్య, జూలూరి రమేష్, ఐనవోలు మహేందర్ రెడ్డి, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.



# తాగునీటి ఎద్దడి లేకుండా చూస్తా

## ::: కౌన్సిలర్ పాపిశెట్టి రాము

**ఆమనగల్లు, మార్చి 05 (అక్షర గళం):** ఆమనగల్లు మున్సిపాలిటీ 5వ వార్డు నవచైతన్య కాలనీలో వేసవి కాలంలో తాగు నీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసు కుంటానని అవార్డు కౌన్సిలర్, ప్రముఖ సంఘ సేవకులు పాపిశెట్టి రాము అన్నారు. గురువారం ఆయన మున్సిపల్ కమిషనర్ శంకర్ నాయక్ తో కలిసి తాగునీటి పైపు లైన్ పనులను పరిశీలించారు. గత కొన్నేళ్లుగా వార్డులో మిషన్ భగీరథ కలెక్షన్ లేక వార్డు ప్రజలు తీవ్ర ఇబ్బందులు గుర్తించుకొని మరమ్మతు పనులను చేపట్టినట్లు తెలి పారు. అనంతరం సమస్యలను స్థానికులతో అడిగి తెలుసుకున్నారు. కమిషనర్ శంకర్ నాయక్ సహకారంతో వార్డుల్లో తాగునీటి సమస్య లేకుండా చూస్తున్నామన్నారు.

**పరామర్శ**

ఆమనగల్లు పట్టణ కేంద్రానికి చెందిన అయూబ్ మహీన్ ల కూతురు (8నెలలు) నిమోనియా వ్యాధితో బాధపడుతూ గురువారం మృతి చెందింది విషయం తెలుసుకున్న ప్రముఖ సంఘ సేవకులు, 5వ వార్డు కౌన్సిలర్ పాపిశెట్టి రాము పాప మృతదేహాన్ని సందర్శించి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపి మనోధైర్యం కల్పించారు. ఆయన వెంట శ్రీను నాయక్ ఉన్నారు.

# పరిశుభ్రమైన వార్డు - ఆరోగ్యమైన జీవితాన్ని తీర్చిదిద్దుత

## ఎనిమిదవ వార్డ్ కౌన్సిలర్ కోడెల గణేష్ లలితా యాదవ్





కల్వకుర్తి మార్చ్ 5 (అక్షర గళం): కల్వకుర్తి మున్సిపాలిటీ పరిధిలోని ఎనిమిదవ వార్డు ప్రజల ఆరోగ్యం పరిశుభ్రతను దృష్టిలో ఉంచుకొని కాలినీలో ఉన్న మురికి కాలువలను శు భ్రం చేయిస్తూ చెత్తాచెదారాన్ని తొలగించి పరిసరాలను పరిశుభ్రంగా చేయించే కార్యక్రమానికి గురువారం వార్డు కౌన్సిలర్ కోడెల లలిత గణేష్ యాదవ్ శ్రీకారం చుట్టారు. ప్రజలు ఆరోగ్యంగా పరిశుభ్రమైన వాతావరణంలో జీవించాలని ఈ బృహత్తర కార్యక్రమం పట్ల వార్డు ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ లలిత గణేష్ యాదవ్ మాట్లాడుతూ మన వార్డు శుభ్రంగా ఉంటేనే మన జీవితంలో ఆరోగ్యంగా జీవిస్తామని అన్నారు వార్డును అన్ని విధాలుగా అభివృద్ధి పరుస్తూ ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయకుండా రూపురేఖలు మారుస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ బృంగి రత్నమాల ఆనంద్ కుమార్ చిమ్ముల శ్రీకాంత్ రెడ్డి అందదు బిక్షపతి కాలనీవాసులు పాల్గొన్నారు.

# ఐక్యత ఫౌండేషన్ ఆధ్వర్యంలో ముస్లిం ఖర్జూర పండ్లు పంపిణీ

## కల్వకుర్తి నియోజకవర్గ వ్యాప్తంగా మైనార్టీ కుటుంబాలకు ఖర్జూర పండ్ల పంపిణీ కార్యక్రమం

## ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు టాస్క్ సీఓఓ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డీ









**కల్వకుర్తి మార్చ్ 5 (అక్షర గళం):** పవిత్ర రంజాన్ మాసము ను పురస్కరించుకొని ఐక్యత ఫౌండేషన్ ఆధ్వర్యంలో ముస్లిం సోదరులకు కల్వకుర్తి నియోజకవర్గ వ్యాప్తంగా కడ్తాల్ అమంగల్ మాడుగుల తలకొండపల్లి వెల్దండ కల్వకుర్తి మండలాలలో దాదాపు 3600 మందికి పైగా ముస్లిం మైనారిటీ కుటుంబాలకు గురువారం ఖర్జూర పండ్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు ఈ సందర్భంగా కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు టాస్క్ సి ఓ ఓ ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి మాట్లాడుతూ శాంతి ప్రేమ ఐక్యతకు ప్రతీకగా నేను ఇచ్చే పవిత్రమైన రంజాన్ మాసం ప్రతి ఒక్కరికి ఆధ్యాత్మికత స్ఫూర్తిని కలిగిస్తుందని పేర్కొన్నారు ఈ పవిత్ర మాసంలో ముస్లిం సోదరులు ఆచరించే ఉపవాస దీక్షలు ఆత్మశుద్ధికి ఆధ్యాత్మిక సాధనకు నిదర్శనమని తెలిపారు. ప్రతిరోజు కటోర ఉపవాసాలు ఆచరిస్తూ మనసును పవిత్రంగా ఉంచుకోవడం ప్రేమ కరుణ దానం వంటి గొప్ప విలువలను ఆచరణలో పెట్టడం రంజాన్ మాసం గొప్పతనం అని ఈ పవిత్ర సమయంలో తన వంతు సహాయ సహకారంగా చిరు కానుకగా ముస్లిం మైనార్టీ సోదరులకు పండ్ల పంపిణీ కార్యక్రమం చేయడం ఎంతో ఆనందంగా ఉందని అన్నారు. మైనార్టీ సోదరుల సంక్షేమం కోసం ఎల్లప్పుడూ తన వంతు తోడ్పాటును అందిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక ముస్లిం మైనార్టీ నాయకులతోపాటు ఆయా మండలాలకు చెందిన ఐక్యత ఫౌండేషన్ సభ్యులు రచ్చ శ్రీరాములు రఘు లింగం గణేష్ యాదయ్య విజయ్ శ్రీపతి శేఖర్ నాగిల్ల శివ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

# ఇఫ్తార్ విందులు శాంతి సామరస్యానికి ప్రతిక



## మాజీ శాసనసభ్యులు కూన శ్రీశైలం గౌడ్

కుత్బుల్లాపూర్, అక్షర గళం : ఇఫ్తార్ విందులు శాంతి సామరస్యానికి ప్రతిక అని మాజీ శాసనసభ్యులు కూన శ్రీశైలం గౌడ్ అన్నారు. కుత్బుల్లాపూర్ నియోజక వర్గంలోని రోడ్ల మేస్త్రి నగర్ లోని ఆజి-అలీ- మసీద్ సమీపంలో సయ్యద్ సలీం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఇఫ్తార్ వేడుకల్లో భాగంగా గురువారం నిర్వహించిన ఇఫ్తార్ విందు కార్యక్రమానికి మాజీ శాసనసభ్యులు కూన శ్రీశైలం గౌడ్ ముఖ్యఅతిథిగా హాజరై విందులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మైనార్టీ సోదరులందరికీ ముందస్తు రంజాన్ శు భాకాంక్షలు తెలియజేశారు. ఇఫ్తార్ అనేది కేవలం ఉపవాస విరమణ మాత్రమే కాదని స్నేహం, ఐక్యత సోదర భావానికి చిహ్నం అని అన్నారు. అనంతరం మైనారిటీ సోదరులతో కలిసి ప్రత్యేక ప్రార్థన చేసి ఉపవాస దీక్ష విరమణ లో పాల్గొన్నారు. ఈ ఇఫ్తార్ విందును ఏర్పాటు చేసిన సయ్యద్ సలీం ను శ్రీశైలం గౌడ్ అభినందించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకుడు బుచ్చిరెడ్డి, చాంద్ పాషా, పున్న రెడ్డి,ఆరిఫ్, షరీఫ్ తోసిపు, షాంషీర్, నబి ఇతర మైనార్టీ సోదరులు కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## ప్రశాంతంగా ఇంటర్మీడియెట్ పరీక్షలు

**అక్షర గళం, మేడ్చల్ ప్రతినిధి :** ఇంటర్మీడియెట్ పరీక్షలలో భాగంగా మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలో ప్రథమ సంవత్సరం మ్యాథ్స్, జువాలజీ, హిస్టరీ పేపర్ పరీక్ష గురువారం ప్రశాంతంగా జరిగిందని జిల్లా ఇంటర్మీడియెట్ అధికారి కిషన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పరీక్షకు జిల్లా మొత్తంగా 61137 మంది విద్యార్థులు హాజరు కావలసి ఉండాగా, 60271 మంది విద్యార్థులు హాజరయ్యారని, 866 మంది విద్యార్థులు గైరుహాజరైనారని తెలిపారు. ఏలాంటి మాల్ ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదని జిల్లా మొత్తంగా పరీక్ష ప్రశాంతంగా జరిగిందని వివరించారు.



## ఇసుక డంపింగ్ యార్డులు ఏర్పాటు చేయాలి బీజేపీ నేతలు


**కల్వకుర్తి మార్చ్ 5 (అక్షర గళం) :** ఊరుకొండ మండలంలో ఇసుక కొరత తీవ్రంగా ఉందని, తక్షణమే ఇసుక డంపింగ్ యార్డులు ఏర్పాటు చేయాలని గురువారం బీజేపీ రాష్ట్ర నాయకులు ముచ్చర్ల జనార్దన్ రెడ్డి డిమాండ్ చేశారు. గతంలో ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డి ఇచ్చిన హామీలను గుర్తు చేశారు. ఇసుక ఎక్కడ కనిపించినా సీజ్ చేస్తాం షాపుల్లో క్వార్టర్ అమ్మితే రూ.10 వేల నజరానా ఇస్తా" అన్న మాటలు ఏమయ్యాయని ప్రశ్నించారు. సొంత అవసరాలకు ఇసుక తీసుకెళ్లే చిన్న, సన్నకారు రైతులపై అధికారులు ఇబ్బందులు పెట్టడం సరికాదన్నారు. ఈ సమావేశంలో బిజెపి కార్యకర్తలు తదితరులు ఉన్నారు.





## ట్రై సైకిల్స్ పంపిణి

**కల్వకుర్తి మార్చ్ 5 (అక్షరగళం) :** రంగారెడ్డి జిల్లా, తలకొండపల్లి మండలంలో ఉన్నతి&శిక్ష ఫౌండేషన్ ఆధ్వర్యంలో వికలాంగులకు ట్రై సైకిళ్లు పంపిణీ చేయడం జరుగుతుందని పేర్కొన్నారు. గురువారం తలకొండపల్లిలో మనుమరాలు ఎర్ర ఇశానా పుట్టినరోజు సందర్భంగా ఫౌండేషన్ నుండి ఇలాంటి కార్యక్రమాలు కొనసాగుతాయని తెలిపారు .వెంకటాపూర్ గ్రామానికి చెందిన మెరేమోని రాములమ్మ, చీపునుంతల గ్రామానికి చెందిన గోస్కె గీత, తలకొండపల్లి గ్రామానికి చెందిన పెరుమాండ్ల విష్ణు మొదలగు వారికి ట్రై సైకిల్స్ అందజేశారు. ఈ సందర్భంగా చైర్మన్ ఎర్ర సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ అంగవైకల్యం అనేది దేహానికి మాత్రమేనని ఆత్మస్థైర్యానికి కాదని మేధ స్సుతో అలోచించి, అంగవైకల్యాన్ని జయించాలని ఫౌండేషన్ నుండి ఎల్లప్పుడూ చే యూతను ఇస్తామని తెలిపారు. ఈ కార్యక్రమాలో ఫౌండేషన్ కార్యదర్శి బండి రఘు పతి, సభ్యులు శ్రీరామ్ , వసపుల రమేష్, తుమ్మల యాదగిరి, గోస్కె శ్రీశైలం, గౌరిగే పార్వతలు, మూడవత్ శివ, మూడవత్ రాయుడు, లక్ష్మయ్య, తదితరులు పాల్గొన్నారు.



## కాంగ్రెస్ పార్టీ రాజ్యసభ అభ్యర్థిగా ఎన్నికైన వేం నరేందర్‌రెడ్డికి శుభాకాంక్షలు

**అక్షర గళం, కుత్బుల్లాపూర్ :** రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ని , కాంగ్రెస్ పార్టీ రాజ్యసభ అభ్యర్థిగా ఎన్నికైన వేం నరేందర్ రెడ్డి లను గురువారం మాజీ టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుత్బుల్లాపూర్ కాంగ్రెస్ నాయకులు నర్సారెడ్డి భూపతిరెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో శాసనసభ సభ్యులు కడియం శ్రీహరి , చింతకుంట విజయరామారావు , రేవూరి ప్రకాష్ రెడ్డి , మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వజ్రేష్ యాదవ్ , ఉప్పల్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ పరమేశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు

# డబుల్ ఇంజన్ సర్కార్‌తో తీవ్రవాద ప్రాబల్యం పూర్తిగా తగ్గిపోయింది

## :: కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్



హైదరాబాద్ : కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ మాట్లాడుతూ గత ఐదేళ్లలో 10 వేల మంది ఉల్ఫా తీవ్రవాదులు జనజీవన స్రవంతిలో కలిశారు. అభివృద్ధి, మౌలిక సదుపాయాల్లోనూ పురోగతి నరేంద్రమోదీ ప్రభుత్వ ప్రోత్సాహంవల్లే ఇదంతా సాధ్యమైందన్న అసోం అధికారులు. క్రైం రేట్ తగ్గడంతోపాటు రూ.5 లక్షల కోట్ల పెట్టుబడులకు ఒప్పందం జరిగిందని వెల్లడి గౌహతిలోని కామాఖ్య అమ్మవారిని దర్శించుకున్న కేంద్ర మంత్రి బండి సంజయ్. నేడు అసోంలోని దిమాహోసావో జిల్లాలోని మారుమూల ప్రాంతాల్లో పర్యటించనున్న బండి సంజయ్. అస్సోం రాష్ట్రంలో కేంద్ర ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, ప్రాయోజిత సంక్షేమ కార్యక్రమాల అమలు తీరు వేగవంతంగా కొనసాగుతోందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అభినందించారు. కేంద్ర ప్రభుత్వ సహాయ సహకారాలతో గత ఐదేళ్లలో అస్సోంలో తీవ్రవాద ప్రాబల్యం పూర్తిగా తగ్గిందని, దాదాపు 10 వేల మంది ఉల్ఫా తీవ్రవాదులు జనజీవన స్రవంతిలో కలిసిపోయారని చెప్పారు. లొంగిపోయిన వారికి అందిస్తున్న సహాయ పునరావాస కారక్రమాలపై పోలీసులను అడిగి తెలుసుకున్నారు. రాష్ట్రంలో ఉద్యోగ నియామకాలు, పెట్టుబడుల వివరాలపైనా కేంద్ర మంత్రి ఆరా తీశారు. గత ఐదేళ్లలో ఒక్క చిన్న ఫిర్యాదు కూడా లేకుండా ఏకంగా 1 లక్షా 51 వేల ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేసినట్లు ఆ రాష్ట్ర ప్రభుత్వ అదనపు ప్రధాన కార్యదర్శి అజయ్ తివారీ వెల్లడించారు. పెద్ద ఎత్తున పెట్టుబడులు వస్తున్నాయని, ఇప్పటి వరకు దాదాపు రూ.5 లక్షల కోట్ల పెట్టుబడులకు ఒప్పందం జరిగిందన్నారు. ఒక్క సెమీ కండక్టర్ పరిశ్రమ ఏర్పాటుతోనే 27 వేల ప్రత్యక్ష ఉద్యోగాలు వచ్చాయన్నారు. దేశంలోని ఇతర రాష్ట్రాలతో పోలిస్తే ఏటా వృద్ధి రేటు పెరుగుతోందని, అదే సమయంలో క్రైం రేటు తగ్గుతోందని, కేంద్రం నూతనంగా అమలు చేస్తున్న క్రిమినల్ చట్టాల అమలులతోనూ ముందంజలో ఉన్నట్లు వివరించారు. మైనింగ్ రంగంలో చేపట్టిన సంస్కరణలతో దేశంలో అసోం నెంబర్ వన్ గా నిలిచిందన్నారు. గతంతో పోలిస్తే ప్రభుత్వ సిబ్బంది పనితీరులోనూ ఎంతో మార్పు వచ్చిందన్నారు. కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సహాయ సహకారాలవల్లే అస్సోం రాష్ట్రంలోని ప్రజల జీవన ప్రమాణాల్లో గణనీయమైన పురోగతి కన్పిస్తోందన్నారు. ఈశాన్య రాష్ట్రాల పర్యటనలో ఉన్న కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి మంత్రి బండి సంజయ్ కుమార్ ఈరోజు అస్సాం రాష్ట్ర రాజధానిలో కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న పలు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై రాష్ట్ర అతిథి గ్రుహంలో సమీక్ష నిర్వహించారు రాష్ట్రంలోని దిమా హసావో జిల్లాలో అమలవుతున్న కేంద్ర ప్రభుత్వ ప్రాయోజిత కార్యక్రమాల పనితీరుపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. తొలుత అసోంలో కేంద్ర నిధులతో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు తీరుపై రెండు గంటలకుపైగా సమీక్షించారు. రాష్ట్ర ప్రభుత్వ అదనపు ప్రధాన కార్యదర్శి అజయ్ తివారీ, డీజీపీ హర్మిత్ సింగ్ సహా వివిధ శాఖల ఉన్నతాధికారులు ఈ సమీక్షకు హాజరయ్యారు. ఈ సందార్భంగా బండి సంజయ్ మాట్లాడుతూ కేంద్ర బడ్జెట్ లో 10 శాతం నిధులను ఈశాన్య రాష్ట్రాల అభివృద్ధికి కేటాయించడంతోపాటు ఆయా అభివృద్ధి, సంక్షేమ పథకాలపై ఎప్పటికప్పుడు సమీక్షిస్తుండటంతో ఈశాన్య రాష్ట్రాల్లోని ప్రజల జీవన ప్రమాణాలు ఎంతో మెరుగయ్యాయని తెలిపారు. ముఖ్యంగా హోం, ఆరోగ్యం, వ్యవసాయం, రోడ్లు మరియు తాగునీటి రంగాల్లో అస్సాం రాష్ట్రం గణనీయమైన పురోగతి సాధించిందని తెలిపారు. విద్య, పోషణ అభియాన్ నిధులు, వృత్తి విద్యలో అసెస్మెంట్ అంశాలపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ద్రుష్టి సారించాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. మరోవైపు కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ గురువారం గౌహతిలోని ప్రసిద్ధ శక్తి పీఠమైన కామాఖ్య దేవి అమ్మవారి ఆలయాన్ని దర్శించుకున్నారు. ఆలయ అధికారులు కేంద్ర మంత్రికి ఘన స్వాగతం పలికారు. గర్భగుడిలోని కామాఖ్య అమ్మవారిని దర్శించుకుని ఆలయ పండితుల ఆశీర్వచనం అందుకున్నారు. కాగా బండి సంజయ్ శుక్రవారం గౌహతి నుండి హెలికాప్టర్ ద్వారా బయలుదేరి దిమా హసావో జిల్లాలోని మారుమూల ప్రాంతాల్లో పర్యటించి కేంద్ర ప్రభుత్వ ప్రాయోజిత పథకాల అమలు తీరు తెన్నులను ప్రత్యక్షంగా పరిశీలించనున్నారు.



## బన్సీలాల్ పేట లో కేంద్రమంత్రి కిషన్ రెడ్డి పర్యటన

హైదరాబాద్ : అప్పుడే మంచినీటి సమస్యలు విద్యుత్ కోతలు మొదలయ్యాయని, వేసవికాలం సమీపిస్తున్న ముందస్తు చర్యలు తీసుకోవడంలో ప్రభుత్వం విఫలమవుతుందంటూ కేంద్రమంత్రి కిషన్ రెడ్డి మండిపడ్డారు.. సికింద్రాబాద్ బన్సిలాల్ పేట్ చాచా నెహ్రూ నగర్ లో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి బస్తీ పర్యటన నిర్వహించారు.. ఈ సందర్భంగా పలు ప్రారంభోత్సవాలు నిర్వహిస్తుండగా టిఆర్ఎస్ నేతలు అడ్డుపడ్డారు. స్థానిక ఎమ్మెల్యే ,కార్పొరేటర్ లేకుండా ప్రారంభోత్సవం చేయడం సరైనది కాదంటూ వాగ్వాదం కు దిగడం తో, తాను కేవలం బస్తీ పర్యటనకు వచ్చానని ప్రారంభోత్సవాలు చేసేది లేదంటూ కిషన్ రెడ్డి వారికి నచ్చ చెప్పారు.. బస్తీలో పర్యటించి స్థానికుల సమస్యలు అడిగి తెలుసుకోవడంతో పాటు, మంచినీటి కుళాయిలను ప్రారంభించి, నూతనంగా ఏర్పాటు చేసిన కమిటీ హాల్ను సందర్శించారు. ప్రధాన కూడలి లో బీజేపీ జెండా ఎగరవేయడంతో పాటు, స్థానిక సమస్యలు తీర్చే బాధ్యత తనదంటూ హామీ ఇచ్చారు.. డ్రగ్స్ పై ఉక్కు పాదం మోపుతామంటూ ప్రకటించే, ఆ మాటని సీఎం మర్చిపోయారని, బస్తీలో విచ్చలవిడిగా గంజాయి అమ్మకాలు జరుగుతున్నాయంటూ ఆయన ఆసహనం వ్యక్తం చేశారు.. మున్సిపల్ శాఖను తన వద్ద పెట్టుకొని, ఎటువంటి

## కుమ్మెర ఘటనపై హెచ్చార్సికి పిర్యాదు

హైదరాబాద్ : నాగర్ కర్నూల్ జిల్లా కుమ్మెర గ్రామంలో జరిగిన రెండు నెలల చిన్నారి మృతి ఘటనలో బాధితులకు న్యాయం జరగలేదని ధర్మ సమాజ్ పార్టీ అధ్యక్షుడు , బిసి , ఎస్సి , ఎస్టీ జేఏసీ చైర్మెన్ డా.విశారదన్ మహారాజ్ అన్నారు. చిన్నారి తల్లితండ్రులు గణేష్ , మౌనికలతో కలిసి రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ చైర్మన్ జస్టిస్ షామీమ్ అక్తర్ ను బిసి పొలిటికల్ ఫ్రంట్ ఛైర్మెన్ బాలరాజ్ గౌడ్ , విశారదన్ మహారాజ్ లు కలిసి ఫిర్యాదు చేశారు. రెండు నెల చిన్నారి మృతికి కాకకులైన వారిపై హత్య కేసు నమోదు చేయలేదని , వారిని ఇప్పటివరకు అరెస్ట్ చేయలేదని కమిషన్ దృష్టికి తీసుకెళ్లారు. ప్రభుత్వం నుండి బాధిత కుటుంబానికి ఎలాంటి చేయూత అందలేదని తెలిపారు. నాగర్ కర్నూల్ జిల్లా పోలీసులు న్యాయం చేయడం లేదని , రాష్ట్ర డీజీపీని కలిశామని , కానీ ఆయన నుండి కూడా ఎలాంటి న్యాయం జరగలేదన్నారు. రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ దృష్టికి తీసుకెళ్లామని తెలిపారు. కమిషన్ నుండైన బాధిత కుటుంబానికి న్యాయం జరుగుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ ఫిర్యాదును స్వీకరించిన కమిషన్ , చిన్నారి హత్య ఘటనపై తీసుకున్న చర్యలపై నివేదిక సమర్పించాలని రాష్ట్ర డీజీపీకి ఆదేశాలు జారీ చేసింది.

## 37కొత్త పుంతలు తొక్కుతున్న చైన్ స్నాచర్లు

మల్కాజిగిరి : నగరంలో చైన్ స్నాచింగ్ ఘటనలు కొత్త కొత్త పద్ధతుల్లో జరుగుతున్నాయి. తాజాగా మల్కాజిగిరిలో మరో ఘటన చోటుచేసుకుంది. న్యూ నల్లకుంటకు చెందిన శ్రీమతి మల్లవజ్జల పద్మజ (57) ఇచ్చిన ఫిర్యాదు ప్రకారం, ఆమె తల్లి మహంకాళి లక్ష్మీకాంతం (85), మల్కాజిగిరి పోలీస్ స్టేషన్ పరిధిలోని హనుమన్పేట్లో నివాసం ఉంటున్నారు. నిన్న సాయంత్రం (మార్చి 4వ తేదీ) సుమారు 5 గంటల సమయంలో ముగ్గురు వ్యక్తులుఒక పురుషుడు, ఒక మహిళ, ఒక చిన్న పాప బాధితురాలు లక్ష్మీకాంతం ఇంటికి వచ్చారు. “మాకు మీ ఇంట్లో ఏదైనా పని ఉందా? ఉంటే మీ ఇంట్లోనే ఉండి పని చేసుకుంటాం” అని అడిగారు. ఆమె పని లేదని చెప్పినప్పటికీ, వారిలో ఉన్న మహిళ “పాపకు దాహం అవుతుంది నీళ్లు ఇవ్వండి” అని కోరింది. దాంతో లక్ష్మీకాంతం ఇంట్లో ఉన్న ఫ్రిజ్ దగ్గరకు వెళ్లిన సమయంలో, వెనుక నుంచి వచ్చిన ఆ వ్యక్తి ఆమె నోట్లో గుడ్డ అరవకుండా చేసి క్యా ఆమె మెడలో ఉన్న సుమారు రెండు తులాల బంగారు గొలుసును తెంపుకుని అక్కడి నుంచి పరారయ్యాడు. ఈ ఘటనపై బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఇలాంటి కొత్త పద్ధతుల్లో మోసాలు, చైన్ స్నాచింగ్లు జరుగుతున్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచిస్తున్నారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు..

# మున్సిపల్ చైర్‌పర్సన్‌గా బాధ్యతలు స్వీకరించిన నీరజ బాల్‌రెడ్డి

తాండూరు : తాండూరు మునిసిపల్ చైర్ పర్సన్ గా నీరజా బాల్ రెడ్డి గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈ కార్యక్రమానికి తాండూర్ ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి తదితరులు హాజరయ్యారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎలక్షన్లలో రెండున్నర సంవత్సరాలు గడిచిన కాలంలో అభివృద్ధి పని ఎలా జరిగిందో ప్రజలు చూసి మరోసారి ఓటు వేశారు. తాండూర్ డెవలప్మెంట్ ను మార్పు దిశగా కొనసాగిస్తాం . నీటి కొరత లేకుండా కాగ్న నది నుండి తాండూరుకు తాగునీరు అందిస్తామని అన్నారు. మనోహర్ రెడ్డి తాండూర్ మాజీ ఎమ్మెల్యే రోహిత్ రెడ్డి పై ఘాటుగా వ్యాఖ్యానించారు. బాల్ బచ్చన్. నువ్వు అభివృద్ధి గురించి మాట్లాడుతావు కానీ నీ సొంత మండలాన్ని అభివృద్ధి పరచుకోవడం చేతకాలేదు. నువ్వు గడిచిన ఐదు సంవత్సరాలు ఏం అభివృద్ధి చేశావు చూపించు . ఒక జూనియర్ కాలేజ్ స్థాపించడానికి చేతకాలేని సన్యాసివి నువ్వు . 30 పడకాల ఆస్పత్రిని ప్రారంభించింది మా కాంగ్రెస్ ప్రభుత్వం. మీ జీవోలు అనేకం తెచ్చి శిలాఫలకానికే పరిమితమైన మీ జీవోలు . గత ఐదు సంవత్సరాలు మీరు చేసిన పనులు ఏవో రెండున్నర సంవత్సరాలు మేము చేసిన పనిలేవు చర్చలకు సిద్ధంగా ఉన్నాం . కోట్ పల్లి ప్రాజెక్టుకు తట్టెడు మన్ను తీయడం చేతకాలేని దద్దమ్మ నువ్వు. మేం వచ్చిన తర్వాత 100 కోట్ల నిధులతో కాల్వ పనులు ప్రారంభించాం. నువ్వు చూపిస్తున్న సినిమా టీజర్ గ్రామపంచాయతీ మరియు మున్సిపల్ ఎన్నికలలో నీకు మేము చూయించినామ్. వచ్చే ఎమ్మెల్యే ఎలక్షన్లలో తాండూరును చూడడానికి భయపడి పోయేలా చేస్తామని అన్నారు.

## పలు అయిల్ మిల్లులపై విజిలెన్స్ దాడులు

పల్నాడు : నరసరావుపేటలో పలు ఆయిల్ మిల్లులపై విజిలెన్స్, ఫుడ్ సేఫ్టీ అధికారులు దాడులు చేసారు. ఆయిల్ మిల్లు,గోడౌన్ లలో తనికీలు చేసి శాంపిల్స్ ని సేకరించారు. విజిలెన్స్ ఫుడ్ సేఫ్టీ అధికారుల దాడులతో మిల్లులకు తాళాలు వేసి యజమానులు వెళ్లిపోయారు. త్వరలో చిలకలూరిపేటలో ఇలాంటి దాడులు జరిగే అవకాశాలు ఎక్కువగా కనిపిస్తున్నాయి. చిలకలూరిపేటలో ప్రముఖ ఆయిల్ మిల్లులో కల్తీ వ్యవహారంపై కుప్పలు కుప్పలుగా ఫిర్యాదులు వెళుతున్నడంతో తనిఖీలు చేసే అవకాశాలు కనిపిస్తున్నాయి



## శ్రీవారిని దర్శించుకున్న మంత్రి పొంగులేటి

తిరుమల : మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి గురువారం ఉదయం కలియుగ దైవం వేంకటేశ్వర స్వామివారిని కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకున్నారు. తెల్లవారుజామున స్వామివారి సేవలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. దర్శనం అనంతరం ఆలయ పండితులు వేద ఆశీర్వచనం, స్వామివారి తీర్థప్రసాదాలను అందజేశారు. మంత్రి మాట్లాడుతూ స్వామివారి సేవలో పాల్గొనడం ఆధ్యాత్మిక అనుభూతిని కలిగించింది. ఆ కలియుగ ప్రత్యక్ష దైవం అనుగ్రహం ప్రజలందరిపై ఉండాలని కోరుకున్నానని అన్నారు.

## రెండు గంజాయి కేసుల్లో నలుగురు విద్యార్థులు అరెస్టు

సంగారెడ్డి : పటాన్ చెరు ఆబ్కారీ స్టేషన్ పరిధిలో రెండు వేర్వేరు కేసుల్లో గంజాయి విక్రయిస్తుండగా నల్గురు విద్యార్థులు పోలీసులకు దొరికిపోయారు. ఒక కేసులో 297 గ్రాముల గంజాయిని సంగారెడ్డి జిల్లా టాస్క్ఫోర్స్ అధికారులు పట్టుకున్నారు. మరొక కేసులో 5.4 గ్రాముల హైబ్రిడ్ గంజాయి ని ఎస్టిఎఫ్ బృందం పట్టుకుంది. హైదరాబాద్ లో వేర్వేరు కళాశాలలో డిగ్రీ చదువుతున్న సాయి చరణ్, అభిషేక్, స్థానికంగా ఉన్న ప్రముఖ విద్యాసంస్థలో చదువుతున్న సాకేత్ రెడ్డి, ఆదిత్య కుమార్ లు నిందితులు. రెండు కేసుల్లో కేసులు నమోదు చేసి పటాన్ చెరు ఆబ్కారీ అధికారులు దర్యాప్తు చేస్తున్నారు.





## మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ తల్లికి శ్రద్ధాంజలి ఘటించిన మాజీ మంత్రి వి శ్రీనివాస్‌గౌడ్

**కల్వకుర్తి మార్చ్ 5 (అక్షర గళం):** కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ తల్లి మంగమ్మ ఇటీవల మృతి చెందారు గురువారం కడ్తాల్ మండలం చల్లంపల్లిలో మాజీమంత్రి వి శ్రీనివాస్ గౌడ్ జైపాల్ యాదవ్ను కుటుంబ సభ్యులను పరామర్శించారు అనంతరం మంగమ్మ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పిస్తూ శ్రద్ధాంజలిని ఘటించారు. ఈ కార్యక్రమంలో బి ఆర్ ఎస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## కవితకు ఘనస్వాగతం



రేణిగుంట : శ్రీవారి దర్శనార్థం హైదరాబాదు నుండి ఇండిగో విమానంలో రేణిగుంట విమానాశ్రయం చేరుకున్న మాజీ తెలంగాణ ఎమ్మెల్సీ, జాగృతి పార్టీ అధ్యక్షురాలు కల్వకుంట కవిత భారీగా స్వాగతం పలికిన అభిమానం వైయస్సార్సీపి కార్యకర్తలు అనంతరం మీడియాతో మాట్లాడుతూ జై తెలంగాణ జై ఆంధ్ర అంటూ నినాదం చేస్తూ నా మీద తప్పుడు కేసులు బనాయించారు ఈరోజు కలియుగ దైవం శ్రీ వెంకటేశ్వర స్వామి దయవల్ల ఎటువంటి కేసులు ఆరోపించలేదు. కాబట్టి స్వామివారి దయతో తిరుమలకు వెళ్తున్నానని తెలిపారు. స్వామి దర్శనానంతరం పార్టీ కార్యచరణ చెప్తామన్నారు.రోడ్డు మార్గనా తిరుపతి అలిపిరి పాదాల మండపంకు బయలుదేరి వెళ్లారు.

### వేంకటేశ్వర స్వామి అంటే మాకు ఎంతో నమ్మకం

రేణిగుంట ఎయిర్ పోర్టు లో తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత మీడియాతో మాట్లాడారు. తప్పుడు కేసు పెట్టి నన్ను నాలుగేళ్లుగా వేధింపులకు గురి చేశారు. కానీ సత్యం నా వైపు ఉండటం, దేవుడి దయతో ఆ కేసును కోర్టు డిశ్చార్జ్ చేసింది. వేంకటేశ్వర స్వామి అంటే మాకు ఎంతో నమ్మకం. కాలి నడకన స్వామివారిని దర్శించుకోవాల్సిన మొక్కు ఉంది. కేసులో క్లీన్ చిట్ వచ్చిన సందర్భంగా మా కుటుంబం, జాగృతి కుటుంబ సభ్యులు మొక్కు తీర్చుకోవటానికి వచ్చాం. ఆంధ్రాలో ఉన్న మా శ్రేయోభిలాషులు,మా మేలు కోరే వారంతా వచ్చి స్వాగతం పలికారు వారందరికీ కృతజ్ఞతలు . త్వరలోనే మేము ఏర్పాటు చేయబోయే పొలిటికల్ పార్టీకి స్వామి వారి ఆశీస్సులు ఉంటాయని నమ్ముతున్నానని అన్నారు.

## మాదిగలకు అన్యాయం చేసారు: మంద కృష్ణ మాదిగ

సికింద్రాబాద్ : కాంగ్రెస్ ప్రభుత్వం,ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాదిగలకు అన్యాయం చేశారు. రాజ్యసభకు ఒక్కరిని కూడా ఎంపిక చేయకుండా మోసం చేశారని ఎమ్మార్పిఎస్ అధినేత మంద కృష్ణ మాదిగ అన్నారు. లోక్ సభ లో మాదిగలకు ప్రాతినిధ్యం లేదు..ప్రస్తుతం రాజ్యసభకు సైతం మాదిగలను ఎంపిక చేయకపోవడం బాధాకరం. తన రాజకీయ జీవితంలో మాదిగలు అన్ని వేళలా అండగా ఉన్నారని చెబుతున్న రేవంత్ మాదిగలను రాజకీయంగా అణిచివేస్తున్నారు. మాదిగలను మభ్య పెట్టి అనేక సందర్భాల్లో కాంగ్రెస్ ప్రభుత్వం అణిచివేతకు గురిచేస్తుంది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో మాదిగలకు లోక్ సభ,రాజ్య సభలలో ప్రాతినిధ్యం ఉన్నప్పటికీ రేవంత్ సర్కార్ లో వివక్షకు గురవుతున్నారని అన్నారు.

తన స్నేహితుడైన వేం నరేందర్ రెడ్డిని ఎంపిక చేస్తున్నట్లు వార్తలు రావడం తమకు బాధ కలిగించాయి. రేవంత్ రెడ్డి,కాంగ్రెస్ ప్రభుత్వం తన సహజత్వాన్ని చాటుకుందని మరోసారి నిరూపితమైంది. వర్గీకరణ విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం మాట పై నిలబడలేదు. గతంలో ఇచ్చిన ప్రభుత్వ ఉద్యోగ నోటిఫికేషన్లకు వర్గీకరణ అమలు చేస్తామని అన్నారు . ఎస్సీ వర్గీకరణ విషయంలో మాదిగలకు 9 శాతం మాత్రమే రిజర్వేషన్లు కల్పించి అన్యాయం చేశారు..మాలల ఒత్తిడికి తలొగ్గి రేవంత్ ఇదంతా చేస్తున్నారు. ఇటీవల కోదాడలో లాకప్ డెత్ లో మాదిగ బిడ్డ కర్ల రాజేష్ చనిపోవడంలో పోలీసుల పాత్ర ఉంది..చిత్రహింసలకు గురిచేసి చంపారు. ఇప్పటివరకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పందించకపోవడం దారుణం. ఎస్సై సురేష్ రెడ్డిని కాపాడడం కోసం ఇదంతా చేస్తున్నారు. గత బి అర్ ఎస్ ప్రభుత్వం ఇలాగే మరియమ్మ లాకప్ డెత్ జరిగితే పోలీసులను వెంటనే విధుల్లో నుండి తొలగించి ఆ కుటుంబాన్ని ఆదుకున్నారని అన్నారు.

## జనరిక్ మెడికల్ షాపును ప్రారంభించిన ఎమ్మెల్యే మాధవరం

హైదరాబాద్ : జనరిక్ మెడిసిన్ వల్ల ఎలాంటి సైడ్ ఎఫెక్ట్స్ ఉండవని, కూకట్ పల్లి శాసనసభ్యులు మాధవరం కృష్ణారావు అన్నారు.. ప్రధానమంత్రి జన ఔషది యోజన కార్యక్రమంలో భాగంగా ఓల్డ్ బోయిన్ పల్లిలో జనరిక్ రెమెడీస్ ఆధ్వర్యంలో లక్ష్మీ నరసింహ జనరిక్ మెడికల్ షాప్ ను, మాజీ కార్పొరేటర్ ముద్దం నరసింహ యాదవ్, స్థానిక బిఆర్ఎస్ పార్టీ నాయకులతో కలిసి, కూకట్ పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ముఖ్యఅతిధిగా హాజరై ప్రారంభించారు. ఈ జనరిక్ మెడిసిన్ వాడటం వల్ల ప్రజలకు ఎలాంటి సైడ్ ఎఫెక్ట్స్ ఉండవని, ఇంగ్లీష్ మందులతో పోలిస్తే 70 నుండి 80 శాతం తక్కువ ధరలలో జెనెరిక్ మెడిసిన్ దొరుకుతుందని పేర్కొన్నారు. ఇంగ్లీష్ మందుల ఫార్ములతో ఉండే జనరిక్ మెడిసిన్ ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని, బోయిన్ పల్లి ప్రజలకు అందుబాటులోకి తెచ్చినందుకు నిర్వాహకులను ఎమ్మెల్యే ఈ సందర్భంగా ఘనంగా అభినందించారు...

# వరుసగా రెండోసారి ఫైనల్‌కు...

## సెమీస్‌లో ఇంగ్లండ్‌పై భారత్ ఘన విజయం
## 7 పరుగుల తేడాతో టీమిండియా గెలుపు
## మెరుపు ఇన్నింగ్స్‌తో చెలరేగిన సంజు సామ్సన్
## జాకబ్ బెతెల్ శతకం వృథా... చివర్లో బౌలింగ్ కట్టుదిట్టం

### ఆదివారం న్యూజిలాండ్‌తో అహ్మదాబాద్‌లో ఫైనల్ మ్యాచ్

**ముంబై: పరుగుల వరద పారిన ఉత్కంఠభరిత మ్యాచ్‌లో భారత్ చివరకు గెలుపు దిశగా అడుగుపెట్టింది. టి20 ప్రపంచకప్ రెండో సెమీఫైనల్‌లో ఇంగ్లండ్‌పై 7 పరుగుల తేడాతో విజయం సాధించిన భారత్ తుది పోరుకు చేరుకుంది. వాంఖెడే మైదానంలో జరిగిన ఈ పోరులో రెండు జట్లు కూడా బ్యాటింగ్‌లో దూకుడుగా ఆడి ప్రేక్షకులను ఉత్కంఠకు గురి చేశాయి. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన భారత్ నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 253 పరుగులు సాధించింది. వరల్డ్ కప్ చరిత్రలోనే ఇది అత్యంత భారీ లక్ష్యాల్లో ఒకటి. ఇంత పెద్ద లక్ష్యాన్ని ఎప్పుడూ ఏ జట్టూ ఛేదించలేదనే రికార్డు నేపథ్యంలో భారత్ గెలుపు ఖాయమేనని అనిపించింది. కానీ ఇంగ్లండ్ జట్టు చివరి వరకు పోరాడి మ్యాచ్‌ను ఆసక్తికరంగా మార్చింది. భారత్ ఇన్నింగ్స్‌లో సంజు సామ్సన్ అద్భుత బ్యాటింగ్‌తో ప్రేక్షకులను అలరించాడు. 42 బంతుల్లో 89 పరుగులు చేసిన అతను ఎనిమిది ఫోర్లు, ఏడు సిక్సర్లతో బౌలర్లపై విరుచుకుపడ్డాడు. అతనికి తోడుగా శివమ్ దూబే 25 బంతుల్లో 43 పరుగులు చేయగా, ఇషాన్ కిషన్ 18 బంతుల్లో 39 పరుగులు సాధించి జట్టుకు బలమైన పునాది వేశారు. ఇంగ్లండ్ తరఫున జాకబ్ బెతెల్ ఒంటరిగా పోరాడాడు. 48 బంతుల్లో 105 పరుగులు చేసి శతకం సాధించినా జట్టును గెలిపించలేకపోయాడు. ఎనిమిది ఫోర్లు, ఏడు సిక్సర్లతో అతను భారత బౌలర్లను తీవ్రంగా ఇబ్బంది పెట్టాడు. చివరికి ఇంగ్లండ్ 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 246 పరుగులు చేసి తృటిలో ఓడిపోయింది.**

ఈ విజయంతో భారత్ వరుసగా రెండోసారి ప్రపంచకప్ తుది పోరుకు చేరింది. ఆదివారం అహ్మదాబాద్‌లో జరిగే ఫైనల్‌లో న్యూజిలాండ్‌తో భారత్ తలపడనుంది. టి20 ప్రపంచకప్‌లో భారత్, న్యూజిలాండ్ మధ్య ఫైనల్ జరగడం ఇదే తొలిసారి. భారత్ ఇన్నింగ్స్ ప్రారంభంలో అభిషేక్ శర్మ త్వరగా అవుట్ అయినప్పటికీ సామ్సన్, ఇషాన్ భాగస్వామ్యం జట్టును దూసుకుపోయేలా చేసింది. ఆర్చర్ వేసిన ఓవర్లలో సామ్సన్ వరుసగా ఫోర్లు, సిక్సర్లు బాది ఇంగ్లండ్ బౌలర్లను ఒత్తిడిలోకి నెట్టాడు. మరోవైపు ఇషాన్ కూడా వేగంగా పరుగులు చేయడంతో పవర్‌ప్లే ముగిసే సరికి భారత్ స్కోరు 67కు చేరింది. డాసన్ బౌలింగ్‌లో భారీ సిక్స్‌తో సామ్సన్ కేవలం 26 బంతుల్లో అర్ధ శతకం పూర్తి చేశాడు. స్యామ్ కరన్ ఓవర్లో ఇద్దరూ కలిసి 20 పరుగులు సాధించడం భారత్‌కు మరింత ఊపు ఇచ్చింది. రెండో వికెట్‌కు 45 బంతుల్లో 97 పరుగులు జోడించిన తర్వాత ఇషాన్ కిషన్‌ను రషీద్ అవుట్ చేశాడు. అయితే స్పిన్‌ను ఎదుర్కొనే వ్యూహంతో భారత్ బ్యాటింగ్‌లో ముందుగా శివమ్ దూబేను పంపింది. అతను రషీద్ ఓవర్లో రెండు భారీ సిక్సర్లు కొట్టి దూకుడును కొనసాగించాడు. ఆర్చర్ ఓవర్లో కూడా సంజు సామ్సన్ మరో రెండు సిక్సర్లు కొట్టాడు. కానీ భారీ షాట్‌కు ప్రయత్నించి చివరకు అవుట్ అయ్యాడు.

సూర్యకుమార్ ఎక్కువసేపు నిలవకపోయినా హార్దిక్ పాండ్యా వేగంగా పరుగులు సాధించాడు. 12 బంతుల్లో 27 పరుగులు చేసి మూడు ఫోర్లు, రెండు సిక్సర్లు కొట్టాడు. ఆర్చర్ వేసిన 19వ ఓవర్లో తిలక్ వర్మ వరుసగా మూడు సిక్సర్లు బాదడం మ్యాచ్‌లో కీలక మలుపుగా మారింది. చివరి ఓవర్లో పాండ్యా మరో రెండు సిక్సర్లు కొట్టడంతో భారత్ స్కోరు 250 దాటింది. చివరి ఐదు ఓవర్లలోనే భారత్ 76 పరుగులు సాధించడం విశేషం. భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన ఇంగ్లండ్ ప్రారంభంలోనే ఫిల్ సాల్ట్ వికెట్ కోల్పోయింది. జోస్ బట్లర్, హ్యారీ బ్రూక్, టామ్ బాంటన్ కూడా ఎక్కువసేపు నిలవలేకపోయారు. అయినప్పటికీ జాకబ్ బెతెల్ మాత్రం దూకుడుగా ఆడుతూ మ్యాచ్‌ను ఆసక్తికరంగా మార్చాడు. బుమ్రా బౌలింగ్‌లో సిక్స్ కొట్టిన అతను వరుణ్ చక్రవర్తి ఓవర్లో వరుసగా మూడు సిక్సర్లు బాదాడు. హార్దిక్ పాండ్యా ఓవర్లో కూడా వరుసగా సిక్స్, ఫోర్ కొట్టాడు. మరోవైపు విల్ జాక్స్ కూడా 20 బంతుల్లో 35 పరుగులు చేసి అతనికి మద్దతిచ్చాడు. వీరిద్దరూ ఐదో వికెట్‌కు 39 బంతుల్లో 77 పరుగులు జోడించారు.





జాక్స్ అవుట్ అయిన తర్వాత స్యామ్ కరన్‌తో కలిసి బెతెల్ మ్యాచ్‌ను గెలిపించేందుకు తీవ్రంగా ప్రయత్నించాడు. చివరి ఐదు ఓవర్లలో 69 పరుగులు చేయాల్సిన దశలో బుమ్రా వేసిన చివరి రెండు ఓవర్లలో కేవలం 14 పరుగులు మాత్రమే రావడంతో మ్యాచ్ భారత్ వైపు తిరిగింది. 45 బంతుల్లో శతకం పూర్తి చేసిన బెతెల్ చివరి ఓవర్లో రనౌట్ కావడంతో ఇంగ్లండ్ ఆశలు కరిగిపోయాయి. ఆర్చర్ చివరి బంతుల్లో మూడు సిక్సర్లు కొట్టినా ప్రయోజనం లేకపోయింది. చివరకు భారత్ 7 పరుగుల తేడాతో విజయం సాధించింది. ఈ మ్యాచ్‌లో మరో విశేషం ఏమిటంటే 17 ఓవర్లు ముగిసే సరికి ఇంగ్లండ్ స్కోరు భారత్‌కంటే ముందే ఉండడం. 10 ఓవర్లకు రెండు జట్లు 119 పరుగులతో సమంగా ఉండగా, 15 ఓవర్లకు ఇంగ్లండ్ 185 పరుగులతో ముందంజలో ఉంది. అయితే చివరి మూడు ఓవర్లలో భారత్ బౌలర్లు మ్యాచ్‌ను పూర్తిగా మార్చేశారు. సంజు సామ్సన్‌కు ఈ మ్యాచ్‌లో అదృష్టం కూడా కలిసి వచ్చింది. అతను 15 పరుగుల వద్ద ఉన్నప్పుడు ఆర్చర్ బౌలింగ్‌లో కెప్టెన్ బ్రూక్ సులభమైన క్యాచ్‌ను వదిలేశాడు. ఆ తర్వాత సామ్సన్ మరింత దూకుడుగా ఆడి జట్టుకు భారీ స్కోరు అందించాడు. మైదానంలో అక్షర్ పటేల్ ఫీల్డింగ్ కూడా భారత్ విజయానికి కీలకంగా మారింది. ముందుగా సులభమైన క్యాచ్‌తో సాల్ట్‌ను అవుట్ చేయడంతో పాటు అద్భుత క్యాచ్‌తో బ్రూక్‌ను వెనక్కి పంపాడు. అలాగే కీలక సమయంలో బౌండరీ వద్ద పరుగెత్తుకుంటూ వచ్చి విల్ జాక్స్ క్యాచ్‌ను పట్టి మ్యాచ్‌ను భారత్ వైపు తిప్పాడు. ఈ విజయంతో భారత్ ప్రపంచకప్ కాపాడుకునే అవకాశానికి మరింత దగ్గరైంది. ఇక చివరి అడుగు మాత్రమే మిగిలి ఉంది. ఆదివారం న్యూజిలాండ్‌తో జరిగే ఫైనల్‌లో విజయం సాధిస్తే భారత్ మరోసారి ప్రపంచ చాంపియన్‌గా నిలుస్తుంది.

---

# హైస్పీడ్‌లో వాహన విక్రయాలు

### ఫిబ్రవరిలో 26 శాతం అప్

### 24 లక్షలకు పైగా అమ్మకాలు : ఫాడా




న్యూఢిల్లీ: జీఎస్‌టీ క్రమబద్ధీకరణ నేపథ్యంలో వాహన విక్రయాల జోరు ఫిబ్రవరిలోనూ కొనసాగింది. గత నెల మొత్తం వాహనాల రిటైల్ విక్రయాలు 26 శాతం పెరిగి 24,09,362 యూనిట్లకు చేరినట్లు డీలర్ల సమాఖ్య ఫాడా ఒక ప్రకటనలో వెల్లడించింది. గతేడాది ఫిబ్రవరిలో 19,17,934 యూనిట్లు అమ్ముడైనట్లు పేర్కొంది. దాదాపు అన్ని విభాగాల్లోనూ అమ్మకాల జోరు కొనసాగినట్లు వివరించింది. ఆరింట అయి దు కేటగిరీల్లో (టూవీలర్లు, త్రీవీలర్లు, ప్యాసింజర్ వాహనాలు, కమర్షియల్ వాహనాలు, ట్రాక్ట ర్లు) ఫిబ్రవరిలో అత్యధికంగా రిటైల్ సేల్స్ నమోదైనట్లు ఫాడా ప్రెసిడెంట్ సీఎస్ విఘ్నేశ్వర్ తెలిపారు. మార్కెట్లో పటిష్టమైన డిమాండ్‌ని ఇది సూచిస్తోందని పేర్కొన్నారు. జీఎస్‌టీ క్రమబద్ధీకరణతో రేట్లు తగ్గడం, పెళ్లిళ్ల సీజన్, కొత్త మోడల్స్ రాకతో బుకింగ్స్ మెరుగ్గా ఉండటంలాంటివి పరిశ్రమకు సానుకూలంగా నిల్చినట్లు వివరించారు. పంట దిగుబడులు బాగుండి గ్రామీణ ప్రాంతాల్లో నగదు లభ్యత మెరుగుపడటం, ఆకర్షణీయమైన మార్కెటింగ్ స్కీములు కలిసి వచ్చినట్లు డీలర్లు చెప్పారు.

**ఇతర విశేషాలు..**

- టూవీలర్లు 25%, త్రిచక్ర వాహనాలు 24%, ప్యాసింజర్ వాహనాలు 26%, కమర్షియల్ వాహనాలు 29% అమ్మకాల వృద్ధిని నమోదు చేశాయి.
- ప్యాసింజర్ వాహనాల అమ్మకాలు 3,13,015 యూనిట్ల నుంచి 3,94,768 యూనిట్లకు పెరిగాయి. పట్టణ ప్రాంతాల్లో 21 శాతం, గ్రామీణ మార్కెట్లలో 34 శాతం వృద్ధి నమోదైంది. స్పోర్ట్స్ యుటిలిటీ వాహనాలు, యుటిలిటీ వాహనాలే ఓవరాల్‌గా ఈ విభాగానికి దన్నుగా నిలుస్తున్నప్పటికీ, చిన్న కార్లకు గ్రామీణ ప్రాంతాల్లో డిమాండ్ నెలకొనడం సానుకూలాంశం.
- టూవీలర్ విక్రయాలు 13,60,155 యూనిట్ల నుంచి 17,00,505 యూనిట్లకు పెరిగాయి.
- వాణిజ్య వాహనాల విభాగంలో అమ్మకాలు 78,219 యూనిట్ల నుంచి 1,00,820 యూనిట్లకు పెరిగాయి.
- త్రీవీలర్ సేల్స్ 1,17,130.. ట్రాక్టర్ల అమ్మకాలు 89,418 యూనిట్లుగా నమోదయ్యాయి.

---




# సెన్కో గోల్డ్ నుంచి షేప్ ఆఫ్ యూ ఏఐ అప్లికేషన్

కోల్‌కతా: ఆభరణాల ఎంపికలో కస్టమర్లకు మరింత సహాయకరంగా ఉండేలా షేప్ ఆఫ్ యూ పేరిట ఏఐ ఫీచర్, అప్లికేషన్‌ని ప్రవేశపెట్టినట్లు సెన్కో గోల్డ్ అండ్ డైమండ్స్ వెల్లడించింది. ఇది తమ అన్ని షోరూమ్‌లతో పాటు సెన్కో యాప్‌లో కూడా అందుబాటులో ఉంటుందని సంస్థ డైరెక్టర్ జోయితా సేన్ తెలిపారు. కస్టమర్లు తమ ముఖాకృతికి తగ్గట్లుగా ఉంటూ, తమ వ్యక్తిత్వాన్ని ప్రతిబింబించే ఆభరణాలను ఎంపిక చేసుకునేందుకు ఇది సహాయకరంగా ఉంటుందని పేర్కొన్నారు. మరోవైపు మహిళా దినోత్సవం సందర్భంగా 10 గ్రా. పసిడి ఆభరణాలపై రూ. 3,000, అలాగే డైమండ్ ఆభరణాల మేకింగ్ చార్జీల్లో 75% వరకు, డైమండ్ విలువలో 15% వరకు, సిల్వర్ ఐటమ్‌ల మేకింగ్ చార్జీలపై 15% వరకు డిస్కౌంట్లు అందిస్తున్నట్లు తెలిపింది. అటు, ఆన్‌లైన్‌కి సంబంధించి మార్చి 8న (ఒక్కరోజు మాత్రమే) గోల్డ్, డైమండ్, ప్లాటినం జ్యువెలరీ మేకింగ్ చార్జీలపై 100 శాతం మినహాయింపు ఉంటుందని పేర్కొంది.

# విజయ్ దేవరకొండ రష్మిక మందన్నా గ్రాండ్ వెడ్డింగ్ భారీ ఖర్చు



టాలీవుడ్‌లో మోస్ట్ లవబుల్ కపుల్‌గా పేరొందిన విజయ్ దేవరకొండ-రష్మిక జంట ఇటీవల వైవాహిక బంధంలోకి అడుగుపెట్టిన విషయం సినీ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది. రాజస్థాన్‌లోని అద్భుతమైన ఉదయ్‌పూర్ ప్యాలెస్‌లో ఈ జంట పెళ్లి ఘనంగా జరిగింది. రాజరిక వేడుకలను తలపించేలా నిర్వహించిన ఈ వివాహానికి కుటుంబ సభ్యులు, అత్యంత సన్నిహితులు మాత్రమే హాజరయ్యారు. పెళ్లి వేడుకలు దాదాపు వారం రోజుల పాటు జరగడం విశేషం. ఉదయ్‌పూర్‌లో పెళ్లి అనంతరం, విజయ్ స్వగ్రామంలో సంప్రదాయ పూజలు, సత్యనారాయణ వ్రతం నిర్వహించారు. అనంతరం సంగీత్ కార్యక్రమం, అభిమానులతో ప్రత్యేక సమావేశం, చివరగా హైదరాబాద్‌లో గ్రాండ్ రిసెప్షన్ వంటి పలు వేడుకలు వరుసగా నిర్వహించారు. ఈ మొత్తం కార్యక్రమం ఒక పెద్ద సెలబ్రేషన్‌లా సాగింది. ఈ నేపథ్యంలో ఈ స్టార్ జంట పెళ్లికి ఎంత ఖర్చు అయ్యిందన్న విషయంపై సోషల్ మీడియాలో చర్చలు మొదలయ్యాయి. సినీ వర్గాల సమాచారం ప్రకారం, మొత్తం పెళ్లి వేడుకలకు దాదాపు రూ.20 కోట్ల వరకు ఖర్చు చేసినట్లు టాక్ వినిపిస్తోంది. పెళ్లి షాపింగ్, నగలు, ఉదయ్‌పూర్‌లో జరిగిన వేడుకలు, స్వగ్రామంలో నిర్వహించిన విందు, సంగీత్ పార్టీ, అభిమానులతో మీట్, అలాగే హైదరాబాద్ రిసెప్షన్ అన్ని కలిపి ఇంతటి భారీ ఖర్చు అయిందని అంటున్నారు ముఖ్యంగా ఈ పెళ్లిలో ధరించిన బంగారు ఆభరణాలు కూడా చర్చనీయాంశంగా మారాయి. సమాచారం ప్రకారం, ఈ జంట పెళ్లి సందర్భంగా మొత్తం మూడు కిలోల బంగారు నగలు ధరించారట. అందులో రష్మిక మందన్నా దాదాపు రెండు కిలోల బంగారు ఆభరణాలు ధరించగా, విజయ్ దేవరకొండ సుమారు ఒక కిలో వరకు నగలు ధరించినట్లు సినీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. పెళ్లి ఏర్పాట్లన్నీ ఒక ప్రముఖ ఈవెంట్ మేనేజ్‌మెంట్ సంస్థ ద్వారా నిర్వహించబడినట్లు సమాచారం. ఈ ఖర్చును విజయ్ దేవరకొండ, రష్మిక మందన్నా ఇద్దరూ కలిసి భరించారని కూడా టాక్ వినిపిస్తోంది. ఈ నేపథ్యంలో ఈ పెళ్లి టాలీవుడ్‌లో అత్యంత ఖరీదైన సెలబ్రిటీ వివాహాల్లో ఒకటిగా నిలిచిందని



సినీ వర్గాలు చెబుతున్నాయి. అంతకుముందు నాగ చైతన్య-సమంత పెళ్లి కూడా భారీ స్థాయిలో జరిగి వార్తల్లో నిలిచింది. ఆ సమయంలో సుమారు రూ.10 కోట్ల వరకు ఖర్చు అయ్యిందని వార్తలు వచ్చాయి. అయితే ఇప్పుడు విజయ్ రష్మిక వివాహం ఆ రికార్డును కూడా మించిందనే చర్చ జరుగుతోంది.



## శ్రీరామ నవమికి..

శ్రీరామ నవమికి ప్రేక్షకులకు బ్యాండ్ మేళం వినిపించ నుంది. 'కోర్ట్' మూవీ ఫేమ్ హర్ష్ రోషన్, శ్రీదేవి అపల్లా జంటగా నటించిన చిత్రం 'బ్యాండ్ మేళం'. సతీష్ జవ్వాజీ దర్శకత్వం వహించారు. మ్యాంగో మాస్ మీడియా సమర్పణలో కోన ఫిల్మ్ కార్పొరేషన్ బ్యానర్‌పై కావ్య, శ్రావ్య నిర్మించారు. ఈ సినిమాను ఈ నెల 13న రిలీజ్ చేయనున్నట్లు యూనిట్ ప్రకటించిన సంగతి తెలిసిందే. అయితే... శ్రీరామ నవమి సందర్భంగా 26కి విడుదల చేయనున్నట్లు గురువారం ప్రకటించారు మేకర్స్. "బ్యాండ్ మేళం' నుంచి ఇప్పటివరకు విడుదల చేసిన టీజర్, ట్రైలర్ ప్రేక్షకుల్లో ఆసక్తిని పెంచాయి. అలాగే 'తిప్పూ కుంటున్నావ్...' అనే మాస్ పెప్పీ సాంగ్, 'పల్లెలోని సందల్లన్ని మీవే...' అనే మెలోడీ సాంగ్ కూడా సినిమా పట్ల అంచనాల్ని పెంచాయి" అని యూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి సంగీతం: విజయ్ బుల్గానిన్.



## డేరింగ్ బైక్ రేసర్

శర్వానంద్ హీరోగా నటించిన చిత్రం 'బైకర్'. అభిలాష్ కంకర దర్శకత్వం వహించిన ఈ సినిమాలో మాళవికా నాయర్ హీరోయిన్‌గా నటించారు. రాజశేఖర్, బ్రహ్మజీ, అతుల్ కులకర్ణి కీలక పాత్రలుపోషించారు. విక్రమ్ సమర్పణలో యూవీ క్రియేషన్స్‌పై వంశీప్రమోద్ నిర్మించిన ఈ చిత్రం ఏప్రిల్ 3న రిలీజ్ కానుంది. తాజాగా ఈ మూవీ గురించి ఓ అప్‌డేట్ ఇచ్చారు మేకర్స్. "ఈ చిత్రం డాల్బీ సినిమా, ఈపీఐక్యూ, 4డీఎక్స్, పీసీఎక్స్ వంటి ప్రీమియం ఫార్మాట్లలోనూ విడుదల కానుంది. దీని ద్వారా ప్రేక్షకులకు మరింత అద్భుతమైన థియేట్రికల్ ఎక్స్‌పీరియన్స్ అందుతుంది" అని యూనిట్ పేర్కొంది. "కుటుంబ భావోద్వేగాలు, యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా రూ÷ందిన చిత్రం 'బైకర్'. ఇందులో శర్వానంద్ డేరింగ్ అండ్ ప్రొఫెషనల్ మోటార్ సైకిల్ రేసర్ పాత్రలో కనిపిస్తారు. ఈ పాత్ర కోసం ఆయన చేసిన ఫిజికల్ ట్రాన్స్‌ఫర్మేషన్ ప్రేక్షకులను ఆకట్టుకుంటుంది. ప్రతి బైక్ రోర్, ప్రతి ఎమోషనల్ సీన్ ప్రేక్షకులను ఆకట్టుకునేలా ఉంటాయి. నటుడు రాజశేఖర్ 'బుల్లెట్ సునీల్' అనే ఎక్స్ మోటోక్రాస్ లెజెండ్ పాత్రలో కనిపిస్తారు" అని చిత్రబృందం తెలిపింది. ఈ చిత్రానికి సంగీతం: జిబ్రాన్, కెమెరా: యువరాజ్.

## కాలి నడకన తిరుమలకు జాన్వీకపూర్!



బాలీవుడ్ భామ, పెద్ది మూవీ హీరోయిన్ జాన్వీ కపూర్ తిరుమల చేరుకున్నారు. ఈ శుక్రవారం ఆమె బర్త్ డే కావడంతో తిరుమల శ్రీవారిని దర్శించుకోనున్నారు. అలిపిరి నడకదారిలో నడుచుకుంటూ బాలీవుడ్ నటి జాన్వీ కపూర్ తిరుమల కొండపైకి చేరుకున్నారు. జాన్వీ కపూర్‌తో పాటు నటి మహేశ్వరి రేపు స్వామివారిని దర్శించుకోనున్నారు బాలీవుడ్ హీరోయిన్ జాన్వీ కపూర్ ప్రస్తుతం రామ్ చరణ్ సరసన నటిస్తోంది. ఉప్పెన ఫేమ్ బుచ్చిబాబు డైరెక్షన్‌లో వస్తోన్న పెద్ది మూవీలో హీరోయిన్‌గా కనిపిచంనుంది. ఈ సినిమా కోసం గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ ఫ్యాన్స్ ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. ఈ మూవీ ఏప్రిల్ 30న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో సందడి చేయనుంది.

PUBLISHED BY G.KALPANA AND PRINTED AT YAGNA PRINTERS AND PUBLICATIONS, H.NO 18-105/4, OPP HANUMANPET, MALKAJGIRI(M)MEDCHAL- 500047, MEDCHAL MALKAJGIRI DISTRICT,TELANGANA PUBLISHED FROM H.NO02-66/254, MALLAREDDY NAGAR PHASE 1, GAJULARAMARAM, QUTHBULLAPUR, MEDCHAL-500055, DISTRICT MALKAJGIRI, TELANGANA, EDITOR : G.DAYAKAR REDDY, RNI :TELTEL/2022/83927, PHONE NUMBER 9908293393,040- 45046154